ఉదయం

www.voodayam.com

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభం

నీటిని పొదుపు చేయడమే కాదు..
ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలి
భవిష్యత్ తరాల మనుగడ కోసం
ఇప్పటి నుంచే మేల్కొనాలి –
గందె వెంకటేశ్వర్లు.

పరకాల అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, భూగర్భ జలాల విచ్చలవిడిగా వినియోగం వంటి పరిణామాలు భవిష్యత్తులో మానవ మనుగడకు సవాలుగా మారే ప్రమాదం ఉందని పరకాల శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, పరకాల ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ వెల్ఫేర్ అధ్యక్షుడు గందె వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం వంటి పరిస్థితులు ఏర్పడితే నీటి కొరత మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్నారు..

తాగునీటి కోసం అల్లాడే పరిస్థితులు రాకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలి

ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని వృథా చేయవద్దంటూ ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ప్రచారం అభినందనీయమని గందె వెంకటేశ్వర్లు అన్నారు. అయితే ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతోపాటు, భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగేలా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు.

రానున్న తరాలకు తాగునీరు అందుబాటులో ఉండాలంటే ఇప్పటి నుంచే వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, చెట్ల పెంపకం వంటి చర్యలను ప్రజా ఉద్యమంగా మార్చాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.నీటిని పొదుపు చేయడం ఒక బాధ్యత.. చెట్లను పెంచడం మరో మహత్తర బాధ్యత

"ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని చెబుతున్నాం. మరి భవిష్యత్తులో నీటి లభ్యత పెరిగేలా ఏం చేస్తున్నాం? అన్నాన్ని పొదుపుగా తినడం ఎంత ముఖ్యమో, రేపటి కోసం పంటను పండించడం కూడా అంతే ముఖ్యం. అలాగే నీటిని కాపాడుకోవడం ఎంత అవసరమో, ప్రకృతిని సంరక్షించడం కూడా అంతే అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, కార్బన్ డైఆక్సైడ్‌ను గ్రహించడంలో, నేల కోతను తగ్గించడంలో, నీరు నేలలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితులు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. అయితే చెట్లు నాటడం ఒక్కటే వర్షాలకు హామీ కాదని, నీటి సంరక్షణతో పాటు సమగ్ర పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రతి ఇంటికి ఒక చెట్టు..ప్రతి పాఠశాలకు పచ్చని బాధ్యత

ప్రతి ఇంటి ఆవరణలో, ప్రతి పాఠశాలలో, అవకాశం ఉన్న ప్రతి కొత్త భవన ప్రాంగణంలో కనీసం ఒకటి లేదా రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే విధానాన్ని ప్రోత్సహించాలని గందె వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మొక్కలు నాటిన తర్వాత వాటిని పట్టించుకోకుండా వదిలేయడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, కనీసం మూడేళ్లపాటు మొక్కలు బతికేలా సంరక్షణ బాధ్యతను నిర్ధారించే విధానం అవసరమని పేర్కొన్నారు. స్థానిక పరిస్థితులకు అనువైన, తక్కువ నీటితో పెరిగే చెట్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

హరిత కార్యక్రమాలు ఫొటోలకే పరిమితం కాకూడదు ప్రభుత్వం చేపట్టే హరితహారం వంటి కార్యక్రమాల్లో నాటిన మొక్కల సంఖ్యతోపాటు, అవి ఎంతవరకు బతికి పెరిగాయనే అంశానికీ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. గ్రామాలు, పట్టణాల వారీగా మొక్కల సంరక్షణను పర్యవేక్షించి, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి వృథాను అరికట్టడం, చెరువులు మరియు ఇతర జలవనరులను పరిరక్షించడం వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేటి బాధ్యతే రేపటి తరాలకు రక్షణ

"నీటిని పొదుపు చేయడం అంటే ఈ రోజును కాపాడుకోవడం. చెట్టును నాటి పెంచడం అంటే భవిష్యత్తు తరాల కోసం పచ్చని భవిష్యత్తుకు పునాది వేయడం. మనం ఈ రోజు ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే, దాని ప్రభావాన్ని మన పిల్లలు, మనవళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే ప్రభుత్వాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమిష్టిగా ముందుకు రావాలి" అని గందె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు లేదా అందుబాటులో ఉన్న ప్రదేశంలో ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నీరు, నేల, చెట్లు, ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని, భవిష్యత్తు తరాలకు జీవనాధారాలను అందించడం నేటి సమాజం ముందున్న ముఖ్య కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం.. శ్రేణులు ఐక్యంగా పనిచేయాలి

ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపు

పరకాల అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



రాబోయే వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రతి పట్టభద్రుడిని కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని ఆయన సూచించారు.

ఆగ్రహంపాడులోని జీఆర్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కృషి

ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. పార్టీలోని నాయకులు, కార్యకర్తలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రతి ఓటు ప్రాధాన్యతను గుర్తించి పట్టభద్రులను చైతన్యపరచాలని, కాంగ్రెస్ పార్టీ విజయానికి సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని స్పష్టం చేశారు.పరకాల నుంచే భారీ ఆధిక్యం సాధిస్తాం

సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి శంకర్ నాయక్ మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన శ్రేణులు ఉన్నాయని తెలిపారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి అత్యధిక ఆధిక్యం అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయ్యూబ్, పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెసు నేతల ఆర్థిక సాయం

మహాదేవపూర్, అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



మహాదేవపూర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గోగుల పెద్ద మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ స్పీకర్ దివంగత నేత శ్రీపాదరావు పాలన కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందించిన ఆయన మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన ఆయన దశదిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొని మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పర్సవేణి నగేష్, కాంగ్రెస్ నాయకులు అటుకపురం స్వామి, మాధరి రమేష్, కోడిపెల్లి పెద్ద మల్లయ్య, బొమ్మన రమేష్, మేడగోని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ధన్యశ్రీ పుష్పాలంకరణ.. రోషన్ చంద్ర పంచకట్టు వేడుకలలో చిన్నారులకు ఆశీర్వదం

*** రోళ్లకల్ సర్పంచ్ దేవి మంగ్య నాయక్,**
*** నారాయణపురం సర్పంచ్ జంపా నాయక్**

పర్వతగిరి, అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామంలో ఖమ్మంపాటి శ్రీను-రాణి దంపతుల కుమార్తె ధన్యశ్రీ నూతన పుష్పాలంకరణ కార్యక్రమం, వారి కుమారుడు రోషన్ చంద్ర పంచకట్టు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.ఈ శుభకార్యాలకు రోలకల్ గ్రామ సర్పంచ్ దేవి మంగ్య నాయక్, నారాయణపురం గ్రామ సర్పంచ్ జంపా నాయక్‌తో పాటు ఖమ్మంపాటి సాయిలు, తదితరులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రముఖుల సందడితో ఈ శుభకార్యాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

చిట్యాల, అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో జీస్టార్ సీసీపీల్ 3 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రజా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత కల్పిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విజేతలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా పట్టుదలతో క్రీడల్లో రాణించాలని, అదే సమయంలో విద్యలోనూ ముందుండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, స్థానిక సర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక సర్పంచులు, మండల నేతలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భూపాలపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ కు ఘన సన్మానం

ఖానాపురం, అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



వరంగల్, నలగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్‌ను బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వం కలిసి శాలువా కప్పి పూల బొకేను అందించి ఘనంగా సన్మానం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భానోత్ వీరన్న, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూక్య వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షులు తేజావత్ బాలు, జాటోత్ రమేష్, తేజావత్ రెడ్యా, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జాటోత్ సదర్ లాల్, గుగులోతు బాలునాయక్, జాటోత్ బాలు, లాకావత్ ప్రవీణ్, గుగులోతు సుమన్, లావుడియా రమేష్, బోడ పూలు, తేజావత్ యాకుబ్, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



అధికారులను నిలదీసిన సర్పంచ్ లు

దండేపల్లి అక్టోబర్ 23
(ఉదయం విలేకరి):

పలు సమస్యలపై అధికారులను మండలంలోని సర్పంచ్ లు నిలదీశారు.దండేపల్లి మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖ అధికారి బాపును విద్యుత్ సమస్యలపై,సర్పంచులు ఇప్ప రవళి, చిలుకూరి మహేష్, కుడిమెత తిరుపతి లు నిలదీశారు,అనంతరం, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ,ఎల్నినో ప్రభావంతో నీటి సమస్యలు ఏర్పడుతున్నందున రైతులు యాసంగి వరి సాగు చేయకుండా అంతర్గత పంటలపై మొగ్గు చూపాలని అన్నారు. వర్షా కా లం రైతులు పండించిన పంటలకు ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు.వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ,శాఖ పరంగా మండలంలో ఏదైనా సమస్యలు ఉంటే వాట్సప్ ద్వారా తెలిపినా తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దుర్గ ప్రసాద్,తహశీల్దార్ రోహిత్ దేస్పాండే,ఎంపీడీఓ జాగర్లమూడి ప్రసాద్,లక్షెటిపేట మార్కెట్ కమిటీ చైర్మన్,అక్కల వెంకటేశ్వర్లు,నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్,వివిధ గ్రామాల సర్పంచ్ లు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల పనుల నిర్వహణకు శాఖల మధ్య సమన్వయం అవసరం

గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలి:
రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు.

నిర్మల్ జిల్లా (ఉదయం ప్రతినిధి)
23 అక్టోబర్ 2026



గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి బాసర లో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గోదావరి పుష్కర ఘాట్లను, తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వేలాది మంది పుణ్య స్నానాలకు తరలివస్తారని, భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు.

పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం:

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు. పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు, పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్, కలెక్టర్, అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు.

ఈ పరిశీలనలో ఇన్‌ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

గుల్లెపెల్లి నవ్యశ్రీ కి పద్మశాలి ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రదానం

ముఖ్య అతిథులు రాపోలు ఆనంద భాస్కర్ పోపా అసోసియేట్ అధ్యక్షులు మాటేటి సంతోష్.

వరంగల్ జిల్లా ఉదయం ప్రతినిధి
అక్టోబర్ 25.



పద్మశాలి అఫిషియల్స్ & ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా), వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం శివనగర్‌లోని పద్మశాలి కళ్యాణ మండపంలో పద్మశాలి ప్రతిభా పురస్కార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కాశీబుగ్గకు చెందిన గుల్లెపెల్లి శివకుమార్, పల్లవి దంపతుల కుమార్తె గుల్లెపెల్లి నవ్యశ్రీ తెలంగాణ ఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో రాష్ట్రస్థాయిలో 320వ ర్యాంకు సాధించినందుకు ప్రోత్సాహకంగా ఆమెకు ప్రతిభా పురస్కార్ అవార్డును అందజేశారు. మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద భాస్కర్ పోపా, వరంగల్ అసోసియేట్ అధ్యక్షులు మాటేటి సంతోష్, పాలకవర్గ సభ్యులు చేతుల మీదుగా నవ్య శ్రీకి ప్రతిభా పురస్కార్ అవార్డు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వారి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ పురస్కారం తనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని నవ్య శ్రీ పేర్కొంటూ, అవార్డును అందించిన పోపా, వరంగల్ పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల /అక్టోబర్ 23(ఉదయం ప్రతినిధి):

ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్ ను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లుకు కేటాయించిన వరి ధాన్యం లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సి.ఎం.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని ఉప తహసిల్దార్ అంజమ్మ తో కలిసి సందర్శించి గ్రామంలో చేపట్టే రీ సర్వే ప్రక్రియను ఉదయం సమయంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టిక, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలోని స్టోర్ గది, వంటగదిని తనిఖీ చేసి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. దసరా సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభమైనందున పాఠశాలను శుభ్రపరచాలని, విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు



- మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి


ఆదిలాబాద్, ఉదయం ప్రతినిధి,
అక్టోబర్ 23:

రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా పత్తిని నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి మెరుగైన ధర పొందాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్ల రెండో రోజైన శుక్రవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9,260 ధర లభించిందని తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ప్రధాన మార్కెట్లతో పోలిస్తే ఆదిలాబాద్‌లోనే అధిక ధర నమోదైందని పేర్కొన్నారు. ఇతర మార్కెట్ల కంటే అధిక ధర ఆదిలాబాద్ మార్కెట్‌లో ప్రైవేటు కొనుగోళ్ల ద్వారా క్వింటాల్ పత్తికి రూ.9,260 ధర లభించగా, జమ్మికుంటలో రూ.9,170, ఖమ్మంలో రూ.9,100, వరంగల్‌లో రూ.9,010 ధర నమోదైనట్లు తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రంలో సీసీఐ ద్వారా క్వింటాల్‌కు రూ.8,667 మద్దతు ధర లభిస్తోందని పేర్కొన్నారు. రైతులకు ఇతర మార్కెట్ల ధరలపై అవగాహన కల్పించేందుకు మార్కెట్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై ధరల వివరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి విట్టల్, మార్కెట్ సూపర్‌వైజర్ స్వామి, అధికారులు, కమీషన్ ఏజెంట్లు, కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు.

బూర సురేందర్ కుటుంబానికి 100 కిలోల బియ్యం పంపిణీ

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన నాగూర్ల వెంకటేశ్వర్లు

పరకాల అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



నర్సక్కపల్లి గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన బూర సురేందర్ కుటుంబానికి తెలంగాణ రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు అండగా నిలిచారు. సురేందర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబానికి తనవంతు సహాయంగా 100 కిలోల బియ్యాన్ని పంపిణీ చేశారు. కష్టకాలంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచి, అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

మాగి పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన వార్తల్లో నిజం లేదు

వ్యక్తిగత కక్షతోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఎంపీడీవోకు గ్రామస్తుల వినతి

నిజాంసాగర్ అక్టోబర్ 23
(ఉదయం ప్రతినిధి):



నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామపంచాయతీ కార్యదర్శిపై ఇటీవల పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) శివకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఓ వ్యక్తి వ్యక్తిగత కక్షతో గ్రామపంచాయతీ కార్యదర్శిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచారం చేయించారని తెలిపారు.

సదరు వ్యక్తి అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని, ఆ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలనే ఉద్దేశంతో పంచాయతీ కార్యదర్శిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు. పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవాలు లేవని, గ్రామపంచాయతీ కార్యదర్శిపై చేసిన ఆరోపణలను తాము ఖండిస్తున్నామని తెలిపారు.గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని గ్రామస్తులు వివరించారు. గ్రామాభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రాలు, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ తదితర పంచాయతీ సంబంధిత పనులను సకాలంలో పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో కార్యదర్శి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వ్యక్తిపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. పత్రికలో వచ్చిన వార్తలపై వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శివకృష్ణకు అందజేసిన వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి - హత్యాయత్నం కేసు నమోదు

జన్నారం,అక్టోబర్ 23 (ఉదయం విలేఖరి)



స్నేహితుడి పై హత్యాయత్నానికి ప్రయత్నించిన మరో స్నేహితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జన్నారం ఎస్సై జి.ఉదయ్ కిరణ్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవునిగూడ గ్రామానికి చెందిన పోకల వంశీ (19) ను అతని స్నేహితుడైన కామన్‌పల్లి గ్రామానికి చెందిన సాట్ల సాయి శివ (20) ను గత మంగళవారం రాత్రి ఫోన్ చేసి బయటకు రమ్మని పిలిచాడు. రాత్రి సుమారు 11.00 గంటలకు దేవునిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో గతంలో ఒక అమ్మాయి విషయమై జరిగిన వివాదం మరియు తన వ్యక్తిగత విషయాలను ఇతరులకు తెలిపాడనే కోపంతో సాయి శివ, వంశీతో గొడవపడి, బూతులు తిడుతూ చేతులతో కొట్టి, తన వద్ద ఉన్న కీ చైన్ కత్తితో వంశీ కడుపు మరియు పక్కటెముకల వద్ద పొడిచి హత్యాయత్నం చేశాడు. గాయపడిన వంశీని జన్నారంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుని తల్లి పోకల కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై ఉదయ్ కిరణ్ వివరించారు

సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు ఎక్కడ....

బిఆర్ఎస్ పార్టీ నాయకుల డిమాండ్.

ఖానాపురం, అక్టోబర్ 25
(ఉదయం ప్రతినిధి):



అయ్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు ఎక్కడ అమలు చేశారని బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనరసయ్యలు బిఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని మాజీ ఎంపీపీ ఇంటి వద్ద సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకపడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణ ఆర్మీ జవాన్ ఇంట వేడుకల సందడి..

చిన్నారులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి ఆశీస్సులు!



పర్వతగిరి , అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): దేశ రక్షణలో సేవలు అందిస్తున్న ఆర్మీ జవాన్ కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన రంగు ప్రసన్న వాణి - రాజేష్ (ఆర్మీ) దంపతుల కుమార్తె సహస్ర గౌడ్ నూతన ఫలపుష్పాలంకరణ మహోత్సవం, కుమారుడు ప్రహర్ష గౌడ్ పంచెకట్టు వేడుకలు ఆదివారం కన్నుల పండువగా జరిగాయి.ఈ శుభకార్యానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగానిలిచారు.

చిన్నారులు సహస్ర గౌడ్, ప్రహర్ష గౌడ్‌లను ఆత్మీయంగా పలకరించి, ఆశీర్వచనాలుఅందించారు. చిన్నారుల భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.ఈ వేడుకలో నాయకులు ఎం. మనోజ్ గౌడ్, ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాదుగుల రాజు, రంగు కుమార్ గౌడ్, మెరుగు వెంకటేశ్వర్లు, బొట్ల మధు, రంగు కుమార్ (ఫెర్టిలైజర్), వార్డు సభ్యులు కొప్పు రాజు, తుంగ రాజు, ఇస్లావత్ హరీష్, దొమ్మటి రాజు, నాయకులు జంగా వీరమల్లు, నీరటి సదానందం, రాజుపేట రాజు, అంబటి కుమార్, చిరుకొండ రమేష్, దుండి హరీష్, సోషల్ మీడియా ప్రతినిధి చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొని చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.

యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నర్సంపేట రూరల్ వుదయం ప్రతినిధి అక్టోబర్ 25. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఆకుల తండా గ్రామంలో యాదవ సంఘం పెద్దమనుషుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకన్నారు. అధ్యక్షులుగా కూకట్ల కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా కన్నెబోయిన శ్రీశైలం, కార్యదర్శిగా గోపు పెద్ద మల్లేష్, కోశాధికారి వంగ సమ్మయ్య, ముఖ్య సలహాదారులు బోయిని సమ్మాలు, కన్నెబోయిన రాజన్న , కూకట్ల ప్రకాష్ సలహాదారులుగా పై వారిని సంఘ సభ్యులందరూ కలసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం పెద్దలు తెలిపారు.

సమీక్షా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమంపై మొగుళ్లపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదివారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, ఒడిసిఎంఎస్ రాష్ట్ర మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రామస్వామి నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై నాయకులతో సమీక్షించి, అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా కృషి చేయాలని కోరారు.ఈ సమావేశంలో మొగుళ్లపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంతకాని రాజుకు ఫోటోగ్రఫీ అకాడమీ జాతీయ పురస్కారం



మహాదేవపూర్ , అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): హైదరాబాద్ లోని మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం జరిగిన ఫ్రోజెన్ ఇన్ టైమ్ పుస్తకావిష్కరణ కాకతీయ వారసత్వ చిత్రాల ప్రదర్శన, పురస్కార ప్రధానోత్సవంలో మహదేవపూర్ వాసి ప్రముఖ ఫోటోగ్రాఫర్ పంతకాని రాజుకు తెలంగాణ ఫోటోగ్రఫీ అకాడమీ జాతీయ పురస్కారం లభించింది.జాతీయ ఫోటోగ్రఫీ సదస్సు2019లో తీసిన అద్భుత చిత్రాలతో ఫ్రోజెన్ ఇన్ టైమ్ ఎ ఫోటోగ్రాఫిక్ ఓడ్ టు కాకతీయ హెరిటేజ్ అనే పుస్తకాన్ని రూపొందించారని,

202426 మధ్య నిర్వహించిన పోటీల నుండి ఎంపిక చేసిన 127 ఉత్తమ చిత్రాల ఫైన్ ఆర్ట్ గ్యాలరీ ప్రదర్శనలో తనకు చోటు దక్కినందుకు కళాకారునిగా గర్వపడుతున్నానని పంతకాని రాజు తెలిపారు.ఈ అవార్డును అకాడమీ కార్యదర్శి బండి రమణ, అధ్యక్షురాలు డా. రావులపల్లి సునీత, సినీ నటులు కె. విశ్వేందర్ రెడ్డి ,ఏఆర్ పి ఎస్,డా. కె. లక్ష్మి ఐఏఎస్ స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్, డా. మామిడి హరికృష్ణ తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ వారి చేతుల మీదుగా అందుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు దుకాణాలు దగ్ధం



నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 25. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం రోజు ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో నర్సంపేట పట్టణంలో అంగడి సెంటర్లో హక ఫార్మర్ సర్వీస్ సెంటర్, లక్ష్మీ ఆటోమొబైల్స్ దగ్ధమయ్యాయి. మంటలు వ్యాపించడంతో రెండు దుకాణాల్లోని సామగ్రి అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. ఈ ప్రమాదంతో దుకాణాల యజమానులు పంబాల రమేష్, శరత్ కుమార్ లకు ఆర్థిక నష్టం వాటిల్లింది. అగ్నిప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

కల్లెడ యాదవ సంఘం అధ్యక్షుడిగా బాల్నే శ్రావణ్ ఏకగ్రీవ ఎన్నిక



గ్రామ యాదవ సంఘం అభివృద్ధికి, కుల సోదరుల ఐక్యతకు శాయశక్తులా కృషి చేస్తాను

పర్వతగిరి అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామ యాదవ సంఘం నూతన కమిటీని కులస్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన కులస్థుల సమావేశంలో అందరి సమక్షంలో ఈ నూతన కమిటీని ప్రకటించారు. యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడిగా బాల్నే శ్రావణ్, ఉపాధ్యక్షుడిగా ఆదోండ రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా దాడి రమేష్, కోశాధికారిగా ఎర్రబోయిన సంపత్, మరియు కులబొట్టు పెద్ద మనిషిగా బాల్నే ఎర్రప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కుల పెద్దలకు, యువతకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ యాదవ సంఘం అభివృద్ధికి, కుల సోదరుల ఐక్యతకు శాయశక్తులా కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కుల పెద్ద మనుషులు ఆదోండ వెంకటయ్య, పోస్ట్ బాల్నే రాజు, ఆదోండ సాయిలు, ఆదోండ సంపత్, బాల్నే యాకయ్య, బాల్నే ఐలయ్య, ఆదోండ రాజు, హరీష్, బాల్నే గద్దం ఐలయ్య, బాల్నే వెంకన్న, బాల్నే విజయరామరాజులతో పాటు గ్రామ యాదవ కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు



కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.
పంట నష్టంపై సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలి.
బిఆర్ఎస్పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ మోటూరి రవి.

వరంగల్ జిల్లా నర్సంపేట, అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి): వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఆదివారం నర్సంపేట రూరల్ మండలం గురిజాల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బావుల కింద సాగు చేస్తున్న పంటలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మోటూరి రవి మాట్లాడుతూ గురిజాల గ్రామంలో పలువురు రైతులు వరితో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్నారని తెలిపారు. సరిపడా నీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలని, నష్టపోయిన రైతులను గుర్తించి

తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెల్లి నరసింగం, మాజీ ఎంపీటీసీలు గద్దం కొమురయ్య, బండారి రమేష్, బండారి చిన్న వెంకటేశ్వర్లు, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్నరాజమల్లు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్రి కుమారస్వామి, యూత్ మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీకాంత్, సీనియర్ నాయకులు బండారి మల్లయ్య, కొమ్మ రవి, యశోద నర్సింగం, ఆరె సుధాకర్, శ్రీరామోజు మధుకరా చారి, పుంజాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1నుండి 9వరకు అమరవీరుల సభలను గ్రామ గ్రామాన విస్తృతంగా జరపండి



*** అమరవీరుల సంస్మరణ సభల వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ**

కొత్తగూడ అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): భారత విప్లవద్యంలో అమరులైన వీరులకు జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు గ్రామ గ్రామాన సభలు సమావేశాలను విస్తృతంగా జరపాలని కోరుతూ ఆదివారం స్థానిక సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనం ఆవరణం ముందు అమరవీరుల వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిపి(ఎంఎల్) న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సూర్యం మాట్లాడుతూ భూమి భుక్తి పేద ప్రజల విముక్తి కోసం కొనసాగిన గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో అమరులైన విప్లవ వీరులకు జోహార్లు అర్పిస్తూ నవంబర్ 1 నుండి 9 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గ్రామ గ్రామాన సభలను విస్తృతంగా జరపాలని వారు అన్నారు.అదేవిధంగా నవంబర్ 7న కొత్తగూడ మండల కేంద్రంలో జరుగు కామ్రేడ్ పాలడుగు క్రిష్ణ స్మారక బహిరంగ సభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు కార్యక్రమంలో పుల్లన్న, శ్రీశైలం, బూర్కా బ్బుచిరాములు, పూర్ణచందర్, సోమన్న,ప్రభాకర్ (రాయుడు), నిర్మల, జాప్లూ సువర్ణపాక నర్సయ్య,నాగేష్,రాజా,జిట్టబోయిన రామచంద్రు, వినేష్, సంజీవరావు, పాల్గొన్నారు.

నర్సంపేటలో భారీ అగ్నిప్రమాదం.
బాధితులకు నష్టపరిహారం అందించాలి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు.



నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 25. పట్టణంలోని అంగడి సెంటర్ ప్రధాన కూడలిలో నెహ్రూ విగ్రహం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య జరిగిన ఈ ప్రమాదంలో రెండు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.80 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత వ్యాపారులను పరామర్శించారు. ఈ సందర్భంగా 16వ వార్డు కౌన్సిలర్ బానోత్ నవీన్ నాయక్, 9వ వార్డు కౌన్సిలర్ కీర్తి దుశ్వంత్ రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ బుస శిరీష రాజు మాట్లాడుతూ పట్టణంలో గత నెల రోజులుగా విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, కోతలు ఏర్పడుతున్నాయని తెలిపారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత వ్యాపారులను స్థానిక ఎమ్మెల్యే పరామర్శించకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి బాధితులను పరామర్శించాలని కోరారు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టి, పట్టణంలోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర విద్యుత్ వ్యవస్థలను తనిఖీ చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

భార్యను చంపి ప్రమాదంగా చిత్రీకరించిన భర్త

మెడపై గాయాలతో బట్టబయలైన ఘోరం!
పర్వతగిరిలో కలకలం: తల్లిని దారుణంగా హత్య చేసిన తండ్రిపై కొడుకు ఫిర్యాదు..
నిందితుడి కోసం పోలీసుల గాలింపు



పర్వతగిరి , అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): భార్యను పక్కా పథకం ప్రకారం హతమార్చి, బైక్ పైనుంచికింద పడిపోయినట్లు నాటకమాడిన ఓ భర్త పాపం పండింది. మెడపై ఉన్న గాయాలు, కొడుకు అనుమానంతో అసలు విషయం బయటపడటంతో నిందితుడు అక్కడికక్కడే పరారైన ఘటన పర్వతగిరి మండలంలో తీవ్ర కలకలం రేపింది. నాటకానికి తెరతీసిన భర్త పోలీసులు మరియు బాధితుడి కథనం ప్రకారం...పర్వతగిరి మండలం మాల్యా తండా అనుబంధ గ్రామమైన అర్జతండాకు చెందిన పాల్యా బాలు (60) తన భార్య పాల్యా పూలమ్మ (53) ను బైక్‌పై తీసుకెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిపోయినట్లు చిత్రీకరించాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం ఏనుగల్లులోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ పరీక్షించిన వైద్యుడు ఆమెలో ఎలాంటి కదలికలు లేకపోవడంతో అనుమానం వ్యక్తం చేసి, పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి పరీక్షించి పూలమ్మ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గాయాలు చూసి షాకైన కొడుకు ఈ విషయాన్ని నిందితుడు బాలు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నతన కొడుకు పాల్యా నవీన్ (24)కు ఫోన్ చేసి చెప్పాడు. హుటాహుటిన గ్రామానికి చేరుకున్న నవీన్ తన తల్లి మృతదేహాన్ని పరిశీలించగా షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. తల్లి మెడకు కుడిపక్కన, ఎడమ ఛాతీపై బలమైన గాయాలతో పాటు ఉరివేసి చంపిన ఆనవాళ్లు కనిపించాయి. అంతేకాకుండా ముఖం, కాలి వేళ్ల వద్ద రక్తస్రావమైన గుర్తులు స్పష్టంగా కనిపించాయి.

కొడుకు నిలదీయడంతో పరారీ

తల్లి శరీరంపై ఉన్న గాయాలను చూసి అనుమానం వచ్చిన కొడుకు నవీన్ వెంటనే తండ్రి బాలును నిలదీశాడు. దీంతో నిజం బయటపడుతుందనే భయంతో నిందితుడు బాలు అక్కడి నుంచి క్షణాల్లో పరారయ్యాడు. తన తల్లిని తండ్రే దారుణంగా హత్య చేసి, సాక్ష్యాలను మాయం చేసేందుకు ప్రమాదంగా నాటకమాడాడని కుమారుడు నవీన్ పర్వతగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొడుకు ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా పర్వతగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు వేగవంతం చేశారు. పరారీలో ఉన్న నిందితుడు బాలు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

రంగు రాజేష్ కుమార్తె నూతన శారీ ఫలపుష్పాలంకరణ వేడుకలు

*** మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు,**
*** జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు**



పర్వతగిరి, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): పర్వతగిరి మండల కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆర్మీ కానిస్టేబుల్ రంగు రాజేష్ కుమార్తె నూతన శారీ ఫలపుష్పాలంకరణ (చీరల) వేడుకలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు విశేషంగా పాల్గొన్నారు.

పర్వతగిరి మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్ధన్ సోదరుడైన ఆర్మీ కానిస్టేబుల్ రంగు రాజేష్ కుమార్తెను మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు ప్రత్యేకంగా కలసి ఆశీర్వదించారు. చిన్నారి కలకాలం ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ జెడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ గంగాధర రావు, మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ సర్వర్, వివిధ పార్టీల నాయకులు గోనే సంపత్, రంగు కుమార్ (ఫెర్టిలైజర్), మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు భాస్కర్ నాయక్ తదితరులు హాజరై చిన్నారికి ఆశీస్సులు అందించారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూప్ సింగ్



కొత్తగూడ అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బానోత్ రూప్ సింగ్ అన్నారు. ఆదివారం మండలంలోని దుర్గారాం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రజానుకూల విధానాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు.మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ రూపుసింగ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా బానోత్ రూపుసింగ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. దుర్గారాం గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు పార్టీలో చేరడంతో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.దుర్గారాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కున్సోత్ రమేష్, డబ్బేటి రమేష్, జాటోత్ జుమ్మిలాల్, బోడ హేమ్లా కాంగ్రెస్ పార్టీలో చేరారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమనే నమ్మకంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు బానోత్ రూపుసింగ్ నాయకత్వంలో దుర్గారాం గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకర బోయిన మొగిలి, మండల నాయకులు బిట్ల శ్రీనివాస్, ఇర్ప రాజేశ్వర్, కాయితోజు ఉపేంద్ర చారి, వజ్జ సాగర్,

బోడ మోహన్,స్వప్న,విజేందర్,ప్రజాప్రతినిధులు,వివిధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఓదార్చిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

దిలీప్ గౌడ్, మల్లయ్య చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళి
ఈ కష్టకాలంలో కొండంత ధైర్యమై నిలుస్తామన్న ఎర్రబెల్లి దయాకర్ రావు



పర్వతగిరి , అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): మండల కేంద్రంలో ఇటీవల చోటు చేసుకున్న విషాదాలు స్థానికులను తీవ్రంగా కలచివేశాయి. మండల కేంద్రానికి చెందిన పుల్లూరి దిలీప్ గౌడ్, కొల్లూరి మల్లయ్య ఆకస్మికంగా మృతి చెందడంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నేరుగా మృతుల నివాసాలకు చేరుకుని, వారి చిత్రపటాలకుపూలమాలలు వేసి అశ్రు నయనాలతో నివాళులర్పించారు. అనంతరం పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు.ఇలాంటి కష్ట సమయంలో ధైర్యాన్ని కోల్పోవద్దని, కుటుంబానికి ఏ కష్టం వచ్చినా తానెప్పుడూ అండగా ఉంటానని ఎర్రబెల్లి భరోసానిచ్చారు. మృతుల పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

మాజీ మంత్రి పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు భారీగా పాల్గొన్నారు.

ఈకార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ ఎం. మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీలు మాదుగుల రాజు, రాయపురం రమేష్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు మెరుగు వెంకటేశ్వర్లు, నాయకులు బొట్ల మధు, రంగు కుమార్ (ఫెర్టిలైజర్), వార్డు సభ్యులు కొప్పు రాజు, తుంగ రాజు, ఇస్లావత్ హరీష్, దొమ్మటి రాజు, నాయకులు జంగా వీరమల్లు, నీరటి సదానందం, రాజుపేట రాజు, అంబటి కుమార్, చిరుకొండ రమేష్, దుండి హరీష్, సోషల్ మీడియా ప్రతినిధి చిన్నపెల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

మన్ కీ బాత్‌తో దేశాభివృద్ధికి స్ఫూర్తి.
162వ బూత్‌లో 139వ ఎపిసోడ్‌ను వీక్షించిన బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్



నర్సంపేట వుదయం ప్రతినిధి అక్టోబర్ 25. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం దేశ ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అన్నారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని 162వ బూత్‌లో నిర్వహించిన మన్ కీ బాత్ 139వ ఎపిసోడ్‌ను ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని దేశ ప్రజలకు అందించిన సందేశాలను ఆసక్తిగా ఆలకించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు చేపడుతున్న సేవా కార్యక్రమాలు, యువత సాధిస్తున్న విజయాలు, వినూత్న ఆవిష్కరణలు, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తుల సేవలను మన్ కీ బాత్ ద్వారా దేశవ్యాప్తంగా పరిచయం చేయడం అభినందనీయమని సందీప్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రధాని సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజహితం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, ప్రజాసేవ, సామాజిక చైతన్యంపై అవగాహన పెంపొందించడంలో మన్ కీ బాత్ కార్యక్రమానికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో మన్ కీ బాత్ కన్వీనర్ కాసుల నాగేంద్రబాబు, విజయ్ సింగ్, సామల ప్రవీణ్ కుమార్, కాసుల గణేష్, కొండ్ర తరుణ్ సాయి, బోలకొండ రమేష్, సురేష్‌తో పాటు బూత్ సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి



తొర్రూరు అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తొర్రూరు మండల అధ్యక్షుడు మోత్కూరి రవీంద్ర చారి, పట్టణ అధ్యక్షులు ముద్దసాని సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉచిత ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఉమ్మడి వరంగల్ ఖమ్మంనల్గొండ ఎమ్మెల్సీ ఓటు హక్కు పొందేందుకు అర్హులైన పట్టబద్రులందరూ ఓటు నమోదు నిర్ణయిత సమయంలోపు నమోదు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధనతో ప్రాధాన్యతతో ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే విద్యార్థులు నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు చెవిటి సధాకర్, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కాందాడి అచ్చిరెడ్డి, జక్కన్న మహబూబ్ రెడ్డి, తాళ్లపల్లి బిక్షం గౌడ్,ఎనగందుల శ్రీనివాస్, బసనబోయిన మహేష్ యాదవ్,కుషాల్ చారి,తూర్పాటి రాంబాబు ,చట్ల చంటి,,మాచర్ల అరవిందు,వల్లపు రాఘవులు,వెన్నం సోమిరెడ్డి,కర్ర అశోక్ రెడ్డి,అశోక్,యర్రం రాజు యాదవ్, నడిగడ్డ మధు, మందపురి శ్రీధర్,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య.. మృతిపై తండ్రికి అనుమానం

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



పరకాల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి): బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న 20 ఏళ్ల విద్యార్థిని బొమ్మరాజు అఖిల ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందింది. తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన బొమ్మరాజు అఖిల (20) బావుపేటలోని సుమతి రెడ్డి కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. దసరా పండుగ సందర్భంగా తండ్రి తన భార్య, కుమార్తెతో కలిసి శాయంపేట మండలం హుస్సేన్‌పల్లి గ్రామంలోని అత్తగారి ఇంటికి వెళ్లాడు. అక్టోబర్ 21న కుమార్తెతో కలిసి నాగారం గ్రామానికి తిరిగి రాగా, ఆరోగ్య కారణాలతో భార్య పుట్టింట్లోనే ఉండిపోయింది.

తండ్రి ప్రతిరోజూ పరకాలకు కూలీ పనులకు వెళ్లేవాడు. అఖిల ఇంటి వద్దే ఉంటూ తండ్రి కోసం భోజనం తయారు చేసేది. ఈ క్రమంలో అక్టోబర్ 24న కూడా తండ్రి కూలీ పనుల నిమిత్తం పరకాలకు వెళ్లాడు. అదే రోజు సాయంత్రం సుమారు 6.25 గంటలకు అఖిల తన మొబైల్ ఫోన్ ద్వారా తండ్రికి ఫోన్ చేసి వెంటనే ఇంటికి రావాలని తెలిపింది. దీంతో తండ్రి రాత్రి సుమారు 8.45 గంటలకు ఇంటికి చేరుకోగా, ఇంటి ముందు గేటుకు తాళం వేసి ఉండటంతో పాటు బయట లైటు ఆపివేసి ఉంది. కుమార్తెను పలుమార్లు పిలిచినా స్పందన రాకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి వెనుక వైపు ప్రహరీ గోడ ఎక్కి లోపలికి వెళ్లి చూశాడు. అక్కడ అఖిల చీరతో ఇనుప రాడ్డుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే చీరను కత్తిపీటతో కోసి కిందకు దించినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తించాడు.

మృతిపై అనుమానాలు.. పోలీసులకు ఫిర్యాదు

తన కుమార్తె మరణానికి గల కారణాలు, పరిస్థితులపై అనుమానం వ్యక్తం చేస్తూ తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అఖిల ఫోన్‌కు సంబంధించిన కాల్ డేటాను సేకరించడంతో పాటు, మృతికి గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.అఖిల మృతికి గల అసలు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అమెరికాలో రెండు పతకాలు సాధించి స్వదేశానికి చేరుకున్న భద్రాచలం పవర్లిఫ్టర్ డి.వి. శంకర్రావు

- 74 ఏళ్ల వయస్సులో ప్రపంచ వేదికపై సత్తా చాటిన క్రీడాకారుడు
- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పూలమాలలు, శాలువాలతో ఘన సత్కారం
- సిటీ స్టైల్ జిమ్ కోచ్ జి.వి. రామిరెడ్డి ఆధ్వర్యంలో క్రీడా ప్రస్థానం.. భద్రాచలానికి గర్వకారణంగా నిలిచిన విజయం

భద్రాచలం 25/10/26 వుదయం ప్రతినిధి:



అంతర్జాతీయ క్రీడా వేదికపై భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేస్తూ, 74 ఏళ్ల వయస్సులోనూ అసాధారణ క్రీడా ప్రతిభను ప్రదర్శించి అమెరికాలో జరిగిన ప్రపంచ పవర్లిఫ్టింగ్ పోటీల్లో రెండు పతకాలు సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ సెంటర్‌కు చెందిన ప్రముఖ పవర్లిఫ్టింగ్ క్రీడాకారుడు డి.వి. శంకర్రావుకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. వయస్సు అనేది విజయానికి అడ్డంకి కాదని, పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే జీవితంలో ఎప్పుడైనా అద్భుత విజయాలను సాధించవచ్చని తన క్రీడా ప్రతిభతో నిరూపించిన శంకర్రావు విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. అమెరికాలో నిర్వహించిన ప్రపంచ క్లాసిక్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని, ప్రపంచ ఎక్విప్డ్ పవర్లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకాన్ని సాధించి రెండు అంతర్జాతీయ పతకాలతో స్వదేశానికి తిరిగి రావడం భద్రాచలం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. ప్రపంచస్థాయి క్రీడా పోటీల్లో వివిధ దేశాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులతో పోటీపడి తన సత్తాను చాటుకోవడం ద్వారా శంకర్రావు భారతదేశ క్రీడా ప్రతిభకు మరోసారి గుర్తింపు తీసుకొచ్చారు. అమెరికాలో జరిగిన పోటీల్లో పాల్గొని రెండు పతకాలు సాధించిన అనంతరం స్వదేశానికి చేరుకున్న శంకర్రావుకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన కోచ్ జి.వి. రామిరెడ్డి, కుటుంబ సభ్యులు, సన్నిహిత బంధువులు, మిత్రులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయానికి చేరుకున్న తమ అభిమాన క్రీడాకారుడిని ఆత్మీయంగా ఆహ్వానిస్తూ పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చిన శంకర్రావును అభినందిస్తూ, ఆయన సాధించిన విజయాల పట్ల తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.. రెండు అంతర్జాతీయ పతకాలతో స్వదేశానికి తిరిగి వచ్చిన డి.వి. శంకర్రావుకు లభించిన ఘన స్వాగతం ఆయన సాధించిన విజయాలకు తగిన గౌరవంగా నిలిచింది. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధిస్తూ భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని, భద్రాచలం ప్రాంతానికి మరింత గుర్తింపు తీసుకురావాలని అందరూ మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

రాజుపేట కాలనీలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- 150 ట్రాఫిక్ కేసులు నమోదు.. రూ.36,390 జరిమానా
- సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం.. గంజాయి, మత్తు పదార్థాలపై కఠిన చర్యలు

భద్రాచలం, 25/10/26 వుదయం ప్రతినిధి:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజుపేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడం, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, నంబర్ ప్లేట్లు లేని మరో 8 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 150 కేసులు నమోదు చేసి రూ.36,390 జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలను నడపరాదని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ అరుణ్ కుమార్ కాలనీవాసులతో మాట్లాడారు. సమాజంలో యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్న గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ



రవాణా వంటి కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలనీల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని కోరారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని గుర్తించి, అవసరమైన సందర్భాల్లో డీ–అడిక్షన్ కేంద్రాలకు తరలించి చికిత్స అందించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు



దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, తమ భవిష్యత్తుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు, కాలనీ వాసులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. కాలనీల్లో నేరాల నియంత్రణకు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని డీఎస్పీ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల సహకారంతో మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలకు భద్రత కల్పించడం, నేరాలకు అడ్డుకట్ట వేయడం, అక్రమ కార్యకలాపాలను నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనల అమలును పర్యవేక్షించడం వంటి లక్ష్యాలతో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని పోలీసు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు, వెంకటప్పయ్య, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం తదితరులు పాల్గొన్నారు.

రోటవేటర్ల... కుంభకోణం

- నాసిరకం యంత్రాలతో మోసం చేశారంటున్న రైతులు
- న్యాయం చేయాలంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం
- నాసిరకం కంపెనీతో వ్యవసాయ అధికారులు కుమ్మక్కయ్యారంటూ అనుమానాలు వ్యక్తం
- నాణ్యమైన యంత్రాలను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్





వైరా,అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతులకు సబ్సిడీ రూపంలో ఆధునిక వ్యవసాయ యంత్రాలను అందిస్తుంటే నాణ్యత ప్రమాణాలను పరిశీలిస్తూ రైతులకు న్యాయం చేయాల్సిన అధికారులే నాసిరకం కంపెనీలతో చేతులు కలిపి రైతులకి నాసిరకం యంత్రాలను అంటగట్టారని రైతులు గగ్గోలు పెడుతున్న ఘటన వైరా, కొనిజర్ల మండలాల్లో నెలకొంది. రైతులు చెప్పిన వివరాల ప్రకారం ప్రభుత్వం ఎస్ఎంఏఎం పథకం ద్వారా రోటవేటర్లను ఇచ్చారని తెలిపారు. అందుకు ఒక్కొక్క రైతు 65వేలు నుంచి 75 వేల వరకు డిపాజిట్ చేశామని అన్నారు. యారో ఫామ్స్ కంపెనీ వారితో వేరే రాష్ట్రాల నుండి నాసిరకం యంత్రాలను తెప్పించి టిడిపి ఆఫీస్ పక్కన దిగుమతి చేసి రైతులను పిలిపించారన్నారు. ఆ యంత్రాలకు కంపెనీ లేబుల్ కానీ సరైన రంగు కానీ లేకుండా నాసిరకంగా ఉండడంతో రైతులు ఆందోళనకి దిగడంతో అధికారులు వెనక్కి తగ్గి మరల వాటికే కొత్త రంగులు వేయించి యారో ఫామ్స్ లేబుల్ అంటించిన యంత్రాలను తీసుకొచ్చి వీటిని తీసుకోకపోతే మీ డీడీలు వెనక్కి రావని, ఆ స్థానంలో వేరే వాళ్ళకి వచ్చిన రోటవేటర్ లను ఇస్తామని చెప్పి రైతులను భయాందోళనకు గురి చేస్తూ బలవంతంగా అంటగట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన కొద్ది రోజులకే బ్లేడ్లు విరగడం, రంగు పోవడం, ఆయిల్ సీల్స్ వంటి సమస్యలతో రోటవేటర్లను మూలన పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల సమస్యను వ్యవసాయ అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ముఖ్య కార్యదర్శి వ్యవసాయ శాఖ తెలంగాణ వారికి, ప్రిన్సిపల్ సెక్రెటరీకి సెక్రెటరీయేట్ లో వ్యవసాయ శాఖ మంత్రి పేషీ నందు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితాలు రాలేదని వాపోయారు. ఎవరైతే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారో వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రస్తుతం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రైతులకు ఇవ్వనున్న వ్యవసాయ యంత్రాలను కూడా నాసిరకమైనవి అందించే అవకాశాలు ఉన్నాయని కావున ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రైతులకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్న మండల స్థాయి ఉద్యోగులు కానీ, జిల్లా స్థాయి అధికారులు కానీ స్పందించకపోవడం వెనక రాష్ట్రస్థాయి అధికారులు ఈ కుంభకోణానికి అండగా ఉన్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో నాసిరకం యంత్రాల కంపెనీతో కుమ్మక్కయ్యారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు రైతులకు ఇచ్చిన యారో ఫామ్స్ రోటవేటర్ ఖరీదు ఎంత? రైతులకు వచ్చే సబ్సిడీ ఎంత? రైతులు డిపాజిట్ చేసిన సొమ్ము ఎంత? వంటి లెక్కలు తేలిస్తే రోటవేటర్ల కుంభకోణం వెలుగులోకి వస్తుందని దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా రైతులకు నాణ్యమైన యంత్రాలను అందించి ఆదుకోవాలని అన్నారు. వైరా కొనిజర్ల మండలంలో దాదాపు 25 నుంచి 30 మంది లబ్ధిదారులు ఉన్నట్టు తెలిపారు. ఉన్నత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో, రైతులకు న్యాయం చేస్తారో లేదో వేచి చూడాల్సిందే...



మేయర్ లక్ష్యంగా మున్నూరు కాపులు

- ఆర్ జె సి కృష్ణ

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 25

ఆర్ జె సి కృష్ణ గారి నివాసంలో ఆయన అధ్యక్షతన కొండ దేవయ్య మున్నూరు కాపు సంఘ జిల్లా ముఖ్య నాయకులు తో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మున్నూరు కాపులను ఐక్యం చేసి ఒక రాజకీయ శక్తిగా తయారవ్వాలని రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఇతర కులాలను కలుపుకొని మేయర్ లక్ష్యంగా ఎదగాలని ఆర్ జె సి కృష్ణ అభిప్రాయపడ్డారు . శెట్టి రంగారావు మాట్లాడుతూ అతిత్వరలో కొండా దేవయ్య గారి మున్నూరు కాపు సంఘాన్ని విస్తృత పరుస్తామని తెలియజేశారు. మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్ మాట్లాడుతూ సంఘం నిర్మాణం జరగాలని . మరియు వ్యక్తి ఆరాధన మూడు కుటుంబాల పాలన తో . మున్నూరు కాపుల చరిత్ర తెలియని వారు నడిపే సంస్థలాగా ఉండకూడదని అన్నారు . పొన్నం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన సంఘాన్ని సేవా రంగంలో ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. లక్కినేని సుధీర్ మాట్లాడుతూ పదేళ్లపాటు సంగం నిర్వీర్యం చేశారని అన్నారు . రాపర్తి శరత్ మాట్లాడుతూ.. సంఘాన్ని ఖమ్మం పట్టణానికి పరిమితం కాకుండా జిల్లావ్యాప్తంగా విస్తృతపరచాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమాల్లో కనిశెట్టి నరసయ్య సాగర్ పిన్ని కోటేశ్వరరావు మాటేటి కిరణ్ లక్కినేని సుధీర్ శ్రీదేవి పసుపులేటి నాగరాజు ఎర్ర జ్ఞానేశ్ నాలం సతీష్ గుండెపునేని రాజా తాళ్లూరి రవి మేకల శంకర్ బాబు ఎండిఓ రవి రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు వరప్రసాద్ మూలగుండ్ల శ్రీహరి కనకం భద్రయ్య రాగం శ్యామ్ వెన్న పందు శ్రీధర్ మూగల శ్రీను రావూరి నరసింహారావు ఉప్పు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వర్ణగిరి పవిత్రోత్సవాలు నాలుగవ రోజు

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి

పవిత్ర పుణ్యక్షేత్రమైన స్వర్ణగిరిలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం శ్రీ స్వామి వారికి యాగశాలలో చతుస్థానార్చన నిర్వహించారు. అనంతరం మూర్తి కుంభ ఆరాధన జరిపి యాగశాలలో హోమ కార్యక్రమాలు జరిపారు. శ్రీ స్వామివారి చిన్నశేష వాహనంపై వటపత్రశాయిగా దివ్య అలంకారంలో కొలువుదీరిన శ్రీ స్వామివారిని ఆలయ తిరుమాడ వీధులలో వైభవంగా ఊరేగించారు. భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన ఈ దివ్య వాహన సేవ భక్తులకు కనులవిందుగా నిలిచింది. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ



వ్యవస్థాపక ధర్మకర్త శ్రీ మానేపల్లి రామారావు గారు కుటుంబ సమేతంగా పాల్గొని, భక్తిశ్రద్ధలతో శ్రీ స్వామివారి దివ్య వాహన సేవను దర్శించుకున్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్–17 క్రికెట్ పోటీలకు భద్రాచలం నుంచి 8 మంది క్రీడాకారుల ఎంపిక

- చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి దక్కిన అరుదైన గుర్తింపు
- కోచ్ శరన్ తేజ శిక్షణలో రాష్ట్రస్థాయికి ఎంపికైన యువ క్రికెటర్లు
- జట్టు కెప్టెన్‌గా అభిరామ్ శ్రీచరణ్
- భద్రాచలం క్రీడారంగంలో హర్షాతిరేకాలు.. క్రీడాకారులకు అభినందనల వెల్లువ

భద్రాచలం, 25/10/26, వుదయం ప్రతినిధి:




తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్–17 క్రికెట్ పోటీలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఒకే క్రికెట్ అకాడమీ నుంచి ఇంతమంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం భద్రాచలం ప్రాంత క్రీడారంగానికి గర్వకారణంగా మారింది. ఈ సందర్భంగా క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లు, క్రికెట్ అభిమానుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. చిన్న వయస్సులోనే క్రికెట్‌పై ఆసక్తిని పెంచుకొని, నిరంతర సాధనతో తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగుతున్న యువ క్రీడాకారులకు ఈ ఎంపికలు మరింత ప్రోత్సాహాన్ని అందించనున్నాయి. భద్రాచలం ప్రాంతానికి చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి వేదికపై తమ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం దక్కించుకోవడం విశేషంగా చెప్పుకోవచ్చు. చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీలో కోచ్ శరన్ తేజ ఆధ్వర్యంలో క్రీడాకారులకు క్రమశిక్షణతో కూడిన శిక్షణ అందిస్తున్నారు. క్రికెట్‌లో రాణించాలంటే ప్రతిభతో పాటు పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన, ఏకాగ్రత, సమయస్ఫూర్తి ఎంతో అవసరమనే లక్ష్యంతో క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి కీలక అంశాల్లో ఆటగాళ్ల నైపుణ్యాలను మెరుగుపరుస్తూ, మైదానంలో పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. జట్టు సభ్యుల మధ్య సమన్వయం, పరస్పర సహకారం, క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ శిక్షణ అందిస్తున్నారు. కోచ్ శరన్ తేజ మార్గదర్శకత్వంలో క్రీడాకారులు నిరంతరం సాధన చేస్తూ తమ ఆటతీరును మెరుగుపరుచుకోవడం, పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఈ ఎంపికలకు దోహదపడింది. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి తగిన శిక్షణ అందించడం ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించడం అకాడమీ ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్‌జీఎఫ్ అండర్–17 క్రికెట్ పోటీలకు చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ నుంచి ఎనిమిది మంది ఎంపిక కావడం అకాడమీ శిక్షణా విధానానికి, క్రీడాకారుల కృషికి లభించిన గుర్తింపుగా క్రీడాభిమానులు భావిస్తున్నారు. ఎంపికైన క్రీడాకారుల్లో రిషికేష్, ప్రసన్న కుమార్, ధీరజ్, కార్తికేయ, చేతన్య సాయి, నక్కా రిత్విక్, ఉజ్వల్ గణేష్, అభిరామ్ శ్రీచరణ్ ఉన్నారు. వీరిలో అభిరామ్ శ్రీచరణ్‌కు జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపిస్తూ, సహచర క్రీడాకారులతో సమన్వయం చేసుకుంటూ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. జట్టులోని ప్రతి క్రీడాకారుడు తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, సమష్టి కృషితో విజయాల దిశగా ముందుకు సాగాలని ఆశిస్తున్నారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం యువ క్రీడాకారుల భవిష్యత్తులో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. ఇలాంటి అవకాశాలు క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు, తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలనే సంకల్పాన్ని బలపరుస్తాయి. ఎస్‌జీఎఫ్ అండర్–17 క్రికెట్ పోటీలకు ఎంపికైన ఎనిమిది మంది క్రీడాకారులను అకాడమీ తరఫున అభినందిస్తూ, వారు రాబోయే పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కెప్టెన్ అభిరామ్ శ్రీచరణ్ నాయకత్వంలో జట్టు సభ్యులందరూ సమష్టిగా కృషి చేసి విజయాలు సాధించాలని, భద్రాచలం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నారు. కోచ్ శరన్ తేజ మార్గదర్శకత్వంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిలను దాటి జాతీయస్థాయి పోటీల్లోనూ రాణించే స్థాయికి చేరుకోవాలని ఆశిస్తున్నారు. చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ అండర్–17 క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల భద్రాచలం ప్రాంతంలో హర్షం వ్యక్తమవుతోంది.

శబరి స్మృతి యాత్రలో ఆదివాసీ భక్తులకు ప్రసాదం, బహుమతులు అందించాలి

- ఆదివాసీ కుటుంబాలకు జనాభా నిష్పత్తి ప్రకారం సన్మానం చేయాలి
- ఆదివాసీల ఆచార సంప్రదాయాలకు తగిన గుర్తింపు ఇవ్వాలి
- దేవస్థానం ఈవో దామోదరరావు, ఏఈవో రామకృష్ణరావుకు వినతిపత్రం అందజేసిన భద్రాచలం ఆదివాసీ సమితి (BAS)

భద్రాచలం, అక్టోబర్ 25, 26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో అక్టోబర్ 26వ తేదీన నిర్వహించనున్న శబరి స్మృతి యాత్ర–2026 సందర్భంగా ఆదివాసీ భక్తులకు తగిన గౌరవం, సముచిత ప్రాధాన్యత కల్పించడంతో పాటు వారి ఆచార సంప్రదాయాలను గౌరవించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఆదివాసీ సమితి (BAS) దేవస్థానం అధికారులను కోరింది. ఈ మేరకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ కే. దామోదరరావు, సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీ రామకృష్ణరావులకు సమితి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. శబరి స్మృతి యాత్ర అనేది కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదని, ఆదివాసీల భక్తి విశ్వాసాలకు, అటవీ ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే విశిష్టమైన కార్యక్రమమని సమితి ప్రతినిధులు పేర్కొన్నారు. రామాయణంలో రామభక్తురాలైన శబరి చూపిన భక్తి, విశ్వాసం, నిష్కల్మషమైన ప్రేమను స్మరించుకుంటూ నిర్వహించే ఈ యాత్రకు ఆదివాసీ సమాజంతో విడదీయలేని అనుబంధం ఉందని వారు గుర్తుచేశారు. అనాదిగా ఆదివాసీ సమాజాలు తమదైన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన



శైలి, ప్రకృతి ఆరాధనతో ప్రత్యేక గుర్తింపును కలిగి ఉన్నాయని, అటువంటి సమాజాల భక్తి భావనలకు దేవస్థానం నిర్వహించే శబరి స్మృతి యాత్రలో తగిన స్థానం కల్పించడం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు తమ సంప్రదాయ దుస్తులు ధరించి, అడవుల్లో లభించే వివిధ రకాల పుష్పాలు, ఫలాలను సేకరించి భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించడం ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం ఆదివాసీ సమితి ప్రధాన కార్యదర్శి పాయం రవివర్మతో పాటు తెల్లం రమణయ్య, కొండ్రు వీరస్వామి, వీసాల కృష్ణయ్య, కుంజా సంతోష్, చిచ్చడి సత్యనారాయణమూర్తి, కొండ్రు సుధారాణి, కణితి రాధ తదితరులు పాల్గొని దేవస్థానం అధికారులకు వినతిపత్రం అందజేశారు.



ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై బీఆర్ఎస్ విస్తృత ప్రచారం

అర్హులైన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: నల్ల భూపాల్ రెడ్డి

అనంతగిరి, అక్టోబర్ 25 వుదయం

మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని శాంతినగర్, లకావరం, గొండ్రియాలా గ్రామాల లో పట్టభద్రుల ఓట్ల నమోదును బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించారు.మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ, ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హత కలిగిన యువతీ యువకులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ యువతను కలిసి ఓటరు నమోదుపై వివరించారు.అర్హులైన వారు నమోదు ప్రక్రియలో పాల్గొని తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై యువతలో అవగాహన పెంచడమే లక్ష్యంగా ప్రచారం నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుగులోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అఫ్జల్, అక్బర్,లచ్చిరెడ్డి, గోవర్ధన్, సర్పంచ్ కలకొండ లచ్చయ్య,మాజీ ఎంపీటీసీ మన్నే కృష్ణవేణి హరీష్,మాజీ సింగిల్ విండో చైర్మన్ నెలకుర్తి ఉషారాణి హనుమంతరావు,వెంకటేశ్వర్లు,రాజేష్,అల్లిక నాగయ్య ఆయా గ్రామాల పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బి.సి.ఆర్. ట్రస్ట్ మెడికల్ క్యాంపు ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన వైద్య సేవలు

- మూడవ నెల మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ చల్లగుళ్ళ నాగేశ్వరరావు
- శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం
- ప్రజారోగ్యమే లక్ష్యంగా బి.సి.ఆర్. ట్రస్ట్ సేవలు కొనసాగించడం అభినందనీయం: సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి
- ప్రతి నెల చివరి ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహణ: ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు
- కందుకూరి శంకరాచారి, వరలక్ష్మిల జ్ఞాపకార్థం షుగర్ పేషెంట్లకు అల్పాహారం అందించిన ఎర్రంశెట్టి వెంకట రామారావు

భద్రాచలం,25/10/26 వుదయం ప్రతినిధి:



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో బండారు చంద్రరావు (బి.సి.ఆర్.) ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైస్ చైర్మన్ చల్లగుళ్ళ నాగేశ్వరరావు అన్నారు. ప్రస్తుత కాలంలో వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించడం, అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. భద్రాచలంలో బి.సి.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడవ నెల మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంపులో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్యులు, వైద్య సిబ్బందితో మాట్లాడి సేవా కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు ముందుకు రావడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోలేని నిరుపేదలకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో అండగా నిలుస్తాయని తెలిపారు. వ్యాధులు ముదిరిన తర్వాత వైద్యులను సంప్రదించడం కంటే, ముందుగానే పరీక్షలు చేయించుకుని ఆరోగ్య సమస్యలను గుర్తించడం ద్వారా అనేక ఇబ్బందులను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ దిశగా బి.సి.ఆర్. ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడటంతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని ప్రశంసించారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా బి.సి.ఆర్. ట్రస్ట్ సేవలు

సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో బండారు చంద్రరావు పేరుతో ఏర్పాటు చేసిన బి.సి.ఆర్. ట్రస్ట్ ప్రజలకు ఉపయోగపడే వైద్య సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తోందని సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. బి.సి.ఆర్. ట్రస్ట్ నిర్వహించిన మెడికల్ క్యాంపులో భాగంగా శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించేందుకు అవకాశం కల్పించారు.

ప్రతి నెల చివరి ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహణ: బి.సి.ఆర్. ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు

ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బి.సి.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం మెడికల్ క్యాంపు నిర్వహించాలని నిర్ణయించినట్లు ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు తెలిపారు. ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే సేవా కార్యక్రమంగా దీనిని కొనసాగించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడంతో పాటు, వ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ క్యాంపులు ఉపయోగపడతాయని వివరించారు.

కందుకూరి శంకరాచారి, వరలక్ష్మిల జ్ఞాపకార్థం షుగర్ పేషెంట్లకు అల్పాహారం

ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంపులో భాగంగా కందుకూరి శంకరాచారి, వరలక్ష్మి ల జ్ఞాపకార్థం ఎర్రంశెట్టి వెంకట రామారావు షుగర్ పేషెంట్లకు అల్పాహారం అందించారు. ఆరోగ్య సేవలతో పాటు రోగులకు అవసరమైన సహకారం అందించడం కూడా సేవలో భాగమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజంలోని నిరుపేదలకు తమకు సాధ్యమైనంత సహాయం అందించడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని, పేదల ఆరోగ్య పరిరక్షణకు దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. బి.సి.ఆర్. ట్రస్ట్ నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. సేవాభావంతో అందించే చిన్న సహాయం కూడా అవసరంలో ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. దాతలు, స్వచ్ఛంద కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమష్టిగా కృషి చేసినప్పుడే ఇటువంటి కార్యక్రమాలు మరింత విజయవంతంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

వైద్యులు, వైద్య సిబ్బంది, ట్రస్ట్ నిర్వాహకుల భాగస్వామ్యం

ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ నీరజారెడ్డి, డాక్టర్ తేజస్విని పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. మారుతి నర్సింగ్ స్టాఫ్‌తో పాటు మెడికల్ ఆఫీసర్ వీరభద్రం, ఫార్మసిస్టులు మల్లికార్జునరావు, గడ్డం నరహరి తమ సేవలను అందించారు. క్యాంపు నిర్వహణలో ట్రస్ట్ నిర్వాహకులు సున్నం గంగా, ఎర్రంశెట్టి వెంకట రామారావు, డి. సీతాలక్ష్మి , కొలగాని రమేష్, నాదెళ్ల లీలావతి, జీవనజ్యోతి, 20వ వార్డు మెంబర్ ఇర్ప అనసూయ, నాగరాజు, అజయ్ కుమార్, భూపేంద్ర, కనక శ్రీ, కోరాడ శ్రీనివాస్, గౌతమి, వై. పూర్ణిమ, నాగలక్ష్మి , రామరాజు, దుర్గ, అర్చన, రామకృష్ణ, కొరసా రవి తదితరులు పాల్గొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమన్వయంతో క్యాంపును నిర్వహించి ప్రజలకు అవసరమైన సేవలు అందించారు. ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే ఈ మెడికల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బి.సి.ఆర్. ట్రస్ట్ కన్వీనర్ బండారు శరత్ బాబు కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ట్రస్ట్ తన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు.

శబరి స్మృతి యాత్రకు శ్రీకారం.. గిరిజన భక్తులను భద్రాచలానికి తీసుకువచ్చేందుకు బయలుదేరిన దేవస్థాన సిబ్బంది



భద్రాచలం 25/10/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో శబరి స్మృతి యాత్ర సందర్భంగా గిరిజన భక్తులను వారి వారి గ్రామాల నుంచి భద్రాచలానికి తీసుకువచ్చేందుకు దేవస్థాన సిబ్బంది బయలుదేరారు. గిరిజన భక్తులకు భద్రాద్రి రామయ్య దర్శన భాగ్యం కల్పించాలనే పవిత్ర సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకుంది. గిరిజన ప్రాంతాల్లో నివసించే భక్తులను స్వామివారి సన్నిధికి తీసుకువచ్చి, వారిని శబరి స్మృతి యాత్రలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో దేవస్థాన సిబ్బంది ఆయా గ్రామాలకు పయనమయ్యారు. రామాయణంలో శ్రీరామచంద్రస్వామివారి పరమ భక్తురాలిగా శబరి మాతకు విశిష్టమైన స్థానం ఉంది. ఆమె చూపిన నిస్వార్థ భక్తి, అచంచలమైన విశ్వాసం, స్వామివారిపై ఉన్న అపారమైన ప్రేమ యుగయుగాలుగా భక్తులకు స్ఫూర్తినిస్తున్నాయి. భగవంతునిపై నిజమైన భక్తి, విశ్వాసం కలిగి ఉండటమే అత్యంత ముఖ్యమనే సందేశాన్ని శబరి మాత జీవితం తెలియజేస్తుంది. ఈ స్ఫూర్తితో నిర్వహించే శబరి స్మృతి యాత్ర గిరిజన భక్తులకు ఆధ్యాత్మికంగా ప్రత్యేకమైన అనుభూతిని అందించనుంది. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం గిరిజన ప్రాంతాల ప్రజలతో ఎంతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని కలిగి ఉంది. గిరిజన భక్తులకు భద్రాద్రి రామయ్య దర్శన భాగ్యం కల్పించేందుకు దేవస్థాన సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమని భక్తులు భావిస్తున్నారు. శబరి స్మృతి యాత్ర ద్వారా గిరిజన భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందడంతోపాటు, భద్రాచలం క్షేత్రంతో వారి అనుబంధం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు.

కాలుష్య రహిత వాహనాలు వాడాలి

తాంగేళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్

యాదాద్రి భువనగిరి జిల్లా, వుదయం ప్రతినిధి



ఈ రోజు భువనగిరి పట్టణం లోని స్థానిక SLNS డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన మై ఇకో EV షోరూం ను మున్సిపల్ చైర్మన్ తాంగేళ్ళపల్లి శ్రీవాణి గారు ప్రారంభిచారు ఈ సందర్బంగా వారు మాట్లాడు తు ప్రజలు కాలుష్య రహిత వాహనాలు వైపు మళ్ళాలి అని కోరారు. ఈ కార్యక్రమం లో షాప్ యజమాని బొందోగుల ఆకాష్ అవినాష్ బొందుగుల మంజుల యాదగిరి పోకల యాదగిరి తాంగేళ్ళపల్లి సురేష్ గోపి తదితరులు పాల్గున్నారు

చతుర్దశి పల్లకి సేవ స్వామి వారికి పంచామృత అభిషేకం

- ఆదిత్య హృదయం పారయణం ముడుపు సమర్పణ
- ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ

జగిత్యాల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)



భానువాసరే ఆశ్వీయుజ మాసం శుక్ల పక్షం చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీసూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు ఆదివారం సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్ర మైన రోజు ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యం ఆయుష్మానుభవం విజయం ధనం ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది తదియ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి పంచామృత అభిషేకాలు సామూహిక ఆదిత్య హృదయం పారయాణం అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు అనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేపట్టారు అనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు ఈకార్యక్రమంలో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వద్ల గట్ట రాజన్న వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్ సహాయ కోశాధికారి గోపి మేనేజింగ్ ట్రస్ట్రి గట్టు రాజేందర్ భారతాల రాజసాగర్ పెద్ది శ్రీనివాస్ ప్రవీణ్ కుమార్ కాదార్ల రాజేందర్ లక్ష్మి నారాయణ జ్యోతి కావ్యశ్రీ అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యం

- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- 200 కోట్ల రూపాయలతో జగిత్యాల జిల్లా తాటిపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- 25 ఎకరాల్లో 2,500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్య
- వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతుల ప్రారంభానికి చర్యలు
- గురుకుల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పుస్తకాలు యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు
- జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు మంత్రుల శంకుస్థాపన

జగిత్యాల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని తెలిపారు పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని పేర్కొన్నారు ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని గురుకుల విద్యా సంస్థల్లో చదువుకున్న ఎంతో మంది నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని రాష్ట్రంలోని 326 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని తెలిపారు ప్రస్తుత ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఒకే ప్రాంగణంలో నాలుగు గురుకుల విద్యాసంస్థలకు అవసరమైన భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టిందన్నారు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే చోట విద్యనభ్యసించేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు వచ్చే విద్యా సంవత్సరం నాటికి కనీసం 10 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజనం పుస్తకాలు యూనిఫాంలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు గురుకుల విద్యార్థుల డైట్ ఛార్జీలను 40 శాతం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు పేర్కొన్నారు గురుకులాలకు సంబంధించిన బిల్లులను గ్రీన్ ఛానల్ ద్వారా క్రమం తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు

సూపర్ ఎల్‌నినోను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి

పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ధర్మపురి బస్ డిపోను కోరిన వెంటనే మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు హిందూ ముస్లిం క్రైస్తవ మత పెద్దల ద్వారా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు అనంతరం ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు తాటిపల్లిలో 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 2,600 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకువస్తూ ముఖ్యమంత్రి స్వయంగా విద్యారంగ అభివృద్ధిపై పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు గురుకుల విద్యార్థులకు డైట్ ఛార్జీలు 40 శాతం కాస్మోటిక్ ఛార్జీలు 200 శాతం పెంచడంతో పాటు నాణ్యమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు విద్య ద్వారానే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రైజింగ్ విధానం ద్వారా విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు ఇంటిగ్రేటెడ్ స్కూల్ సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు వివిధ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు ఒకే ప్రాంగణంలో ఆధునిక తరగతి గదులు క్రీడా మైదానాలు గ్రంథాలయం తదితర సదుపాయాలతో విద్యనభ్యసించే అవకాశం కలుగుతుందని వివరించారు బీసీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించినప్పుడు డైట్ ఛార్జీల పెంపుతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందుతున్నట్లు గమనించానని తెలిపారు ఆధునిక సాంకేతికతను వినియోగించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని త్వరిత గతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసన్నాంబ



మున్సిపల్ ఛైర్‌పర్సన్ సమిండ్ల వాణి గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్ మార్కెట్ కమిటీ చైర్మన్లు నారాయణ రెడ్డి సర్పంచులు ఉప సర్పంచులు కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

పేదల వైద్యానికి సర్కారు భరోసా.. రూ.10 లక్షల వరకు ఉచిత చికిత్స

- సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి) :



ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్), రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా అర్హులకు వైద్య సహాయం అందిస్తూ, మెరుగైన చికిత్సకు ప్రభుత్వం తోడ్పాటునిస్తోందని పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మాతృశ్రీ, అశ్విని, వర్ష ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పేదల వైద్య అవసరాలు, ప్రభుత్వ పథకాలపై ఆయన మాట్లాడుతూ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడికి వినికిడి సమస్య కారణంగా శస్త్రచికిత్స అవసరమైందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని రూ.5 లక్షల సహాయం అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. చికిత్స అనంతరం బాలుడు మాట్లాడుతున్నాడని కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తోందని వివరించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా కూడా అవసరమైన వారికి ఆర్థిక సాయం అందిస్తూ వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తోందన్నారు. నిమ్స్, గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజీఎం వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులు ప్రభుత్వ పథకాల నిబంధనల ప్రకారం వైద్య సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ప్రమాదం జరిగిన తొలి గంటలోనే ఆసుపత్రికి చేరిస్తే ప్రాణాలు కాపాడే అవకాశాలు పెరుగుతాయని ఆది శ్రీనివాస్ అన్నారు. పోలీసు, న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో బాధితులకు సాయం చేసేందుకు వెనుకాడవద్దని సూచించారు. ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందించడంపై ప్రజల్లో అవగాహన పెంచాలని పేర్కొన్నారు. ప్రతి 20 కిలోమీటర్ల పరిధిలో అత్యవసర వైద్య సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు ఆసుపత్రులు కూడా సామాజిక బాధ్యతతో పేదలకు వైద్య సేవలు అందించాలని కోరారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ సంపత్ రెడ్డి, వైద్యులు చీకోటి సంతోష్ కుమార్, సత్యనారాయణ స్వామి, సాయికుమార్, పరమేశ్వర్, ప్రవీణ్ వర్మ, హారిక, అనిల్, శ్రీదేవి, మున్సిపల్ అధికారులు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్ల పుట్టిందని వేధింపులు

- అదనపు కట్నం కోసం చిత్రహింసలు
- ఇంటికి తాళాలు గేటు ముందే పసి బిడ్డతో నిరాహార దీక్ష
- అరుణ రాకను చూసి పారిపోయిన భర్త అత్త మామ మరిది

కోరుట్ల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)



కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో అత్తగారి ఇంటి గేటు ముందు ఓ మహిళ ఆదివారం నిరహార దీక్షకు దిగింది ఆమె రాకను గమనించిన భర్త బర్కం గణేష్ అత్త బర్కం రాజు మామ బర్కం గంగాధర్ మరిది బర్కం ప్రణీత్ లు ఇంటికి గేటుకు తాళాలు వేసి పారిపోయారని బాధితురాలు బర్కం అరుణ ఆరోపిస్తోంది ఆమె కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి బుగ్గారం మండలం గోపులాపూర్ కు చెందిన గోవిందుల అరుణ అలియాస్ బర్కం అరుణ కు వెంకటాపూర్ కు చెందిన బర్కం గణేష్ తో 2023 ఆగస్టు 31న వివాహం జరిగింది పెండ్లి సమయంలో ఆమె తల్లిదండ్రులు 14 తులాల బంగారం నాలుగు లక్షల రూపాయలు నగదు లాంఛనాల ప్రకారం ఇతర సామగ్రి అప్పగించారు. వీరికి హారిక అనే కూతురు జన్మించగా ఆడబిడ్డ పుట్టిందని వేధింపులకు గురి చేశారు మీ తల్లిదండ్రులను ఇంకా అదనపు కట్నం ఇవ్వమని అడగాలని ఆడ పిల్ల పుట్టిన నాటి నుండి అరుణ ను భర్త అత్త మామ మరిది చిత్ర హింసలకు గురిచేసినట్లు ఆమె ఆరోపిస్తోంది పలు సార్లు అరుణ ను ఆమె తల్లి గోవిందుల పద్మను సైతం గతంలో కొట్టి రక్తగాయాల పాలు చేశారని అరుణ ఆరోపిస్తోంది బిడ్డ పుట్టిన నాటి నుండి నేటి వరకు బిడ్డను తల్లిని ఇంటికి రాకుండా అనేక రకాల హింసలు పెట్టినట్లు ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన 14 తులాల బంగారం నాలుగు లక్షల నగదు రూపాయలు కూడా ఇవ్వకుండా అత్త మామలు బర్కొ రాజు బర్కం గంగాధర్ లు కాజేశారని అరుణ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది తనకు న్యాయం చేయాలni ఇటీవలే అరుణ తండ్రి విదేశాలలో చనిపోయారని అప్పుల పాలు అయ్యామని బిడ్డను సాధలేక పసి బిడ్డతో తాను ఏ పని చేసుకోలేక పస్తులతో కాలం వెళ్లదీస్తున్నాననని అరుణ తెలిపింది అనేక సార్లు పలువురు పెద్ద మనుషులతో కలిసి వెళ్ళి తనకు తన బిడ్డకు న్యాయం చేయాలని మమ్ములను ఇంట్లోకి అనుమతించి సాధాలని ఎంత బ్రతిమిలాడినా భర్త, అత్త మామ మరిది సాగనీయడం లేదని అరుణ ఆరోపిస్తోంది కనీసం నా తల్లిదండ్రులు పెట్టిన 14 తులాల బంగారం నాలుగు లక్షల నగదు రూపాయలు ఇచ్చినా తన బిడ్డను తాను సాధుకొని బ్రతుకు తానని ఎంత బ్రతిమిలాడినా మామ గంగాధర్ అత్త రాజు భర్త గణేష్ మరిది ప్రణీత్ లు కనికరించడం లేదని అరుణ ఆవేదన వ్యక్తం చేస్తోంది తాను తన బిడ్డ అనారోగ్యాల పాలు అయినా భర్త అత్త మామలు పట్టించు కోవడం లేదని అరుణ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది ఇప్పటికైనా తనకు తన బిడ్డకు న్యాయం చేయాలని అరుణ వేసుకుంటుంది తాను తన బిడ్డ హారిక భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని మాకు న్యాయం జరిగేంత వరకు భర్త ఇంటి ఎదుట నిరాహార దీక్ష విడిచేది లేదని అరుణ పేర్కొంది.

పోలీస్ అమరవీరులకు ఘన నివాళి

ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ముత్తారం అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి):



ముత్తారం మండల కేంద్రంలోని కాసార్ల గడ్డ ప్రధాన చౌరస్తా వద్ద ఆదివారం పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్సై ఎన్. రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు స్ఫూర్తిదాయకమని, ప్రజల భద్రత కోసం వారు చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

పూలు పూస్తే పరిమళం కాదు.. దుర్వాసనే!

- ఓడేడ్–గోదావరిఖని ప్రధాన రహదారి వెంట చెట్లతో ప్రజలకు ఇబ్బందులు
- సాయంత్రం వేళల్లో తీవ్ర దుర్వాసన.. పట్టించుకోని అధికారులు?
- సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు, గ్రామస్తుల విజ్ఞప్తి

ముత్తారం అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి):



రహదారులకు ఇరువైపులా పచ్చదనాన్ని పెంపొందించేందుకు నాటిన చెట్లు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సింది పోయి ఇబ్బందులకు కారణమవుతున్నాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడ్–గోదావరిఖని ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన చెట్లకు పూలు పూయడంతో వాటి నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో ఈ పూల నుంచి వస్తున్న దుర్వాసన తీవ్రంగా ఉంటోందని, ఆ మార్గంలో ప్రయాణించాలంటేనే ఇబ్బందిగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు.

సాధారణంగా రహదారుల వెంట చెట్లు ఉండటం వల్ల పచ్చదనం పెరగడంతో పాటు ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. అయితే ఓడేడ్–గోదావరిఖని ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్ల పూల నుంచి వెలువడుతున్న దుర్వాసన మాత్రం అందుకు భిన్నంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. చెట్లు పూలతో నిండిపోయిన సమయంలో వాటి నుంచి వచ్చే వాసన పరిసర ప్రాంతాల్లో వ్యాపిస్తోందని, ముఖ్యంగా సాయంత్రం వేళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందని అంటున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాలపై ప్రయాణించే వారు, నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు.

ఆరోగ్యంపై ఆందోళన

దుర్వాసన కారణంగా ఎక్కువసేపు ఆ ప్రాంతంలో ఉండాల్సి వస్తే ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతాయేమోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి వెంట ప్రయాణించే వారితో పాటు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు కూడా ఈ సమస్యపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పూల నుంచి వెలువడుతున్న వాసనకు అసలు కారణమేంటి? ఆ చెట్ల జాతి ఏమిటి? వాటి నుంచి వచ్చే వాసన ప్రజల ఆరోగ్యంపై ఏమైనా ప్రభావం చూపుతుందా? అనే అంశాలపై సంబంధిత అధికారులు, నిపుణులు పరిశీలన చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే దుర్వాసన వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయనే విషయంపై ఇప్పటివరకు నిర్ధారణ లేనందున అధికారులు శాస్త్రీయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించేనా?

ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటడం పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనం పెంపునకు ఎంతో ఉపయోగకరం. అయితే ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని గుర్తించి పరిష్కరించడం కూడా సంబంధిత శాఖల బాధ్యతేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఓడేడ్–గోదావరిఖని ప్రధాన రహదారిపై నెలకొన్న ఈ సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, దుర్వాసనకు కారణాలను గుర్తించాలని కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత నిపుణుల ద్వారా చెట్లను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

రహదారి వెంట పచ్చదనం ఉండటం ఎంత ముఖ్యమో, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కూడా అంతే ముఖ్యమని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. చెట్ల కారణంగా ఏర్పడుతున్న దుర్వాసన సమస్యను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో వ్యవహరించి, చెట్ల జాతి, పూల స్వభావం, దుర్వాసన తీవ్రతను పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారా? లేక ప్రజలు ఇలాగే ఇబ్బందులు పడాల్సి వస్తుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

దాసరి భాగ్య మృతి పట్ల సర్పంచ్ సంతాపం

అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం

ముత్తారం అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి):



పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన దాసరి పురుషోత్తం సతీమణి దాసరి భాగ్య మృతి పట్ల గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భాగ్య మృతి వార్త తెలుసుకున్న సర్పంచ్ వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతురాలి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి తనవంతు సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. దాసరి భాగ్య మృతి గ్రామంలో విషాదాన్ని నింపింది. ఆమె మృతి పట్ల గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ఆదివారం తమ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్ కవిత కిషన్‌రెడ్డిని పలువురు అభినందించారు.

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు రెండు విడతల్లో 10 లక్షల ఎల్‌ఓసీ మంజూరు
- నిమ్స్ వైద్యులకు ప్రత్యేక చికిత్స అందించాలని ఆదేశం

కోరుట్ల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)

నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆపదలో ఉన్న వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తన సేవలను కొనసాగిస్తున్నారు అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన ఓ మహిళకు ఆర్థిక సహాయం అందించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు కథలాపూర్ మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మండలోజీ అనిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమైన పరిస్థితిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు దీనిపై ఆయన వెంటనే స్పందించి నిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు అంతేకాకుండా వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం ద్వారా మొదటి విడతలో 5 లక్షల రూపాయల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు తాజాగా బాధితురాలి వైద్య చికిత్సకు మరింత ఆర్థిక సహాయం అవసరమని గుర్తించి రెండో విడతలో మరో 5 లక్షల రూపాయల ఎల్‌ఓసీని మంజూరు చేయించడంతో మొత్తం 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుబాటులోకి వచ్చింది దీంతో బాధిత కుటుంబానికి వైద్య ఖర్చుల విషయంలో ఎంతో ఊరట లభించింది ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించి వైద్య సహాయం అందించేందుకు కృషి చేస్తున్న ఆది శ్రీనివాస్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు

మట్టి తరలింపును అడ్డుకున్న రైతులు..

- పైప్‌లైన్ ధ్వంసం.. రూ.50 వేల నష్టపరిహారం చెల్లించలేదని రైతు ఆవేదన
- అనుమతులు ఇవ్వలేదన్న తహసీల్దార్.. 24 గంటల అనుమతులున్నాయంటూ కంపెనీ సిబ్బంది వాదన



ముత్తారం అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి):

పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ శివారులో మెగా కంపెనీకి చెందిన టిప్పర్ల ద్వారా మట్టి తరలింపును ఆదివారం రైతులు అడ్డుకున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా మట్టి తరలిస్తున్నారని, దీంతో పంట పొలాలకు, చెరువు కట్టపై ఉన్న మట్టి రహదారికి నష్టం వాటిల్లుతోందని కేషన్‌పల్లి, దర్యాపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గత వేసవిలో మట్టి తరలింపు సమయంలో టిప్పర్ల రాకపోకల వల్ల తన వ్యవసాయ భూమికి సాగునీరు అందించే పైప్‌లైన్ పూర్తిగా ధ్వంసమైందని మల్లయ్య అనే రైతు తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతులకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చయిందని, ఆ మొత్తాన్ని చెల్లించాలని కంపెనీ ప్రతినిధులను కోరినట్లు చెప్పారు. పైప్‌లైన్ మరమ్మతు చేసుకుంటే నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు అడిగితే కంపెనీ ప్రతినిధులు ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు.

అనుమతులపై భిన్న వాదనలు

మట్టి తరలింపునకు అనుమతులు ఉన్నాయా? అనే అంశంపై స్థానికంగా చర్చ నెలకొంది. కంపెనీకి మట్టి తరలింపు అనుమతులు ఇచ్చారా అని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా, తాను ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే తమకు 24 గంటల అనుమతులు ఉన్నాయని, రైతులు ఏం చేసుకుంటారో చేసుకోవచ్చంటూ కంపెనీ సూపర్‌వైజర్ దురుసుగా మాట్లాడినట్లు రైతులు ఆరోపించారు. వ్యవసాయ భూములకు, సాగునీటి సదుపాయాలకు నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గతంలో జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించడంతోపాటు, మట్టి తరలింపునకు సంబంధించిన అనుమతులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

రాజన్న అభివృద్ధి ఒక కన్ను.. పట్టణ ప్రగతి మరో కన్ను

- వేములవాడను టెంపుల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- అడుగుల రహదారి పనులు తుది దశకు.. నాణ్యతలో రాజీ వద్దు
- రూ.250 కోట్లకు పైగా రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి) :



దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణ ప్రగతిని ప్రభుత్వం రెండు కళ్లలా భావిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు, రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు వేములవాడను ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలో కొనసాగుతున్న 80 అడుగుల రహదారి నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ పాలకవర్గం, సంబంధిత అధికారులతో కలిసి ఆది శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా సాంకేతిక నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకు ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులు సుమారు 55 శాతం, అన్నదాన సత్రం నిర్మాణ పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయని వివరించారు. అదనంగా రూ.99.40 కోట్ల నిధులు మంజూరుకావడంతో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్నదాన సత్రానికి రూ.35 కోట్లు, ఆలయ అభివృద్ధికి రూ.51 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చేపడుతున్న క్రమంలో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

80 అడుగుల రహదారికి మహర్దశ...

వేములవాడ పట్టణంలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కీలక దశకు చేరుకున్నాయని విప్ పేర్కొన్నారు. రహదారి నిర్మాణానికి సుమారు రూ.6.5 కోట్లు, విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాట్లకు అవసరమైన నిధులు కేటాయించినట్లు తెలిపారు. రహదారి విస్తరణకు సంబంధించి రూ.47 కోట్లతో జీవో తీసుకొచ్చి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ అభివృద్ధి సాధ్యమవడంలో రహదారి విస్తరణకు సహకరించిన నిర్వాసితుల పాత్ర కీలకమని, వారి సహకారం, త్యాగాలను మరువలేమని అన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడంతోపాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రహదారులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

మూడో వంతెన పనులకు వేగం...

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మూడో వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేశామని ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో శంకుస్థాపనలకే పరిమితమైన పనులను ముందుకు తీసుకెళ్లి ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి చేయడంపై దృష్టి సారించామన్నారు. పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత ప్రమాణాలతో, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు, అలాగే రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్ర నియమాలకు అనుగుణంగా జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని విప్ స్పష్టం చేశారు. శృంగేరి పీఠాధిపతి సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల పునరుద్ధరణ, విస్తరణ, జీర్ణోద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు వివిధ ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాజన్న భక్తుల విశ్వాసాలు, సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వేములవాడను ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా పర్యాటక ప్రాంతంగానూ తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని గతంలో ఇచ్చిన హామీ అమలులోకి రాలేదని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆది శ్రీనివాస్ విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆలయ అభివృద్ధితోపాటు పట్టణ అవసరాలకు ప్రాధాన్యమిస్తూ నిధులు మంజూరు చేస్తోందని అన్నారు. వేములవాడ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ అవసరమైన నిధులు తీసుకొచ్చి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. రాజన్న ఆలయ ప్రగతి, పట్టణ అభివృద్ధి సమాంతరంగా కొనసాగిస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, సంబంధిత సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అనాధ శవానికి పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియలు



శ్రీరాముల లింబాద్రి

కోరుట్ల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)

కోరుట్ల పట్టణ కాలేజీ గ్రౌండ్ లో ఓ అనాధగా మరణించారు ఇట్టి విషయం తెలుసుకున్న జగిత్యాల జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ సంఘానికి తెలుపగా వెంటనే స్పందించిన కోరుట్ల పట్టణ సంఘ అధ్యక్షులు గుంటుక ప్రసాద్ ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్ 32వ వార్డు మాజీ కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ ఆడెపు నరేష్ మృతదేహాన్ని స్మశాన వాటికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు ఈకార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ వసీం మైనార్టీ సోదరులు అమీర్ సమీర్ గుద్దేటి విజయ్ సంకోజి రవి స్మశాన వాటిక వీరభద్ర శ్రీనివాస్ లక్ష్మణ్ శంకర్ పాల్గొన్నారు

ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధర్మపురి,అక్టోబర్25(వుదయం ప్రతినిధి):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర బిసీ సంక్షేమ,రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్,సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు దర్శించు కున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రులకు దేవస్థాన సాంప్రదా యం ప్రకారం పూర్ణకుం భంతో,మేళతాళాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న మంత్రు లకు వేద పండితు లు,అర్చకులు వేద మంత్రోచ్చా రణలతో ఆశీర్వచనం అందిం చారు. తదుపరి దేవస్థానం పక్షాన ఈవో శ్రీ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం చిత్ర పటాన్ని అందజేసి ఘనం గా సన్మా నించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, మున్సి పల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్, మున్సిపల్ కమిష నర్ శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాస్ సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ఓంకార శర్మ, ముఖ్య అర్చకులు రమణయ్య, అర్చకులు నంబి నరసింహమూర్తి,చక్రపాణి కిరణ్ కుమార్, అభిషేకం పురోహితులు బొజ్జా సంతోష్ కుమార్,రాజగోపాల్, సీని యర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి తదితర అర్చక సిబ్బంది,నాయకులు, పాల్గొన్నారు.

పాటల ప్రయాణంలో రాజేందర్ మరింత ఉన్నతికి ఎదగాలి

- కళాకారులతోనే సమాజ చైతన్యం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్


జగిత్యాల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)



కవులు కళాకారుల ద్వారానే సమాజ చైతన్యం సాధ్యమని జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అన్నారు స్థానిక పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్ లో ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన ప్రముఖ జానపద గాయకుడు పలిగిరి రాజేందర్ తను కళారంగంలో 25 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా పలిగిరి పాతికేళ్ళ కళా ప్రస్థానం పేరుతో కార్యక్రమం నిర్వహించగా వందల మంది కళాకారులు కళాభిమానులు హాజర య్యారు ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ హాజరయ్యారు ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఒక కళాకారుని ప్రస్థానంలో ఇంతమంది కళాకారుల అభిమానం సంపాదించుకోవడం కళాకా రులు అందరు ఒక్క తాటిపైకి వచ్చి రాజేందర్ ను ఆశీర్వదించడం అభినందనీయమన్నారు కళాకారుల అట పాట ప్రజాప్రతినిధుల గెలుపులో సైతం ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు తెలంగాణ ఉద్యమం సామాజిక ఉద్యమం సామాజిక చైతన్యంలో కళాకారుల పాత్ర మరు వలేనిదని గుర్తు చేశారు రాజేందర్ తో గత పదిహేనేళ్లుగా తనతో అనుబంధం ఉందని అయన ప్రతిభతోనే ఈ స్థాయికి ఎదగడం దానివెనుక అయన కృషి ఆటుపోట్లు ఎదుర్కొని నిలబడ్డ అయన పట్టుదల అభినం దనీయమన్నారు భవిష్యత్ లో పలిగిరి రాజేందర్ మరిన్ని విజయాలు సాధించాలని మరింత ఉన్నతి పేరు ప్రఖ్యాతలు సాధించా లని ఆకాంక్షించారు సమాజంలో కళాకారుల పాత్ర అనిర్వచనీయం అని మన సంస్కృతి సంప్రదాయాలని అంతరించిపోతున్నా కళలను భావి తరాలకు అందించేందుకు ఇలాంటి వేడుకలు మరిన్ని జరగలిసిన అవసరం ఉందన్నారు అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మాట్లాడుతూ పలిగిరి రాజేందర్ కళా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ మాట్లాడుతూ రాజేందర్ తన శిష్యుడు అని అయన ఇంత ఉన్నతికి ఎదిగి ఇంత గొప్ప కార్యక్రమం నిర్వ హించుకోవడం అభినందనీయమన్నారు అనంతరం ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన పలిగిరి రాజేందర్ ధర్మపురి నియోజకవర్గం మండలం కు చెందిన వ్యక్తి కావడం మాకు గర్వకారణం అన్నారు తన కళా ప్రస్థానంలో మరిన్ని విజయాలు సాధించి మరింతగా పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు అనంతరం జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కవులు కళాకారులను ప్రోత్సహిస్తుందని గుర్తు చేశారు జగిత్యాల జిల్లా జానపదం దేశ విదేశాల్లో సైతం మారుమ్రోగడం జగిత్యాల జిల్లాకే గర్వకారణం అన్నారు ప్రముఖ గాయకుడు పలిగిరి రాజేందర్ తన కళా ప్రస్థానంలో 25 ఏళ్ళు పూర్తి చేసుకోవడం సాధారనా విషయం కాదన్నారు ఆ కళమ్మ తల్లీ ఆశీస్సులతో కళారంగంలో పలిగిరి రాజేందర్ మరింత ఎదగాలని కోరారు కార్య క్రమంలో భాగంగా పలిగిరి రాజేందర్ ను పలువురు కళాకారులూ కళాభిమానులు సినీ జానపద కళాకారులు రాజేందర్ గురువులు పుర ప్రముఖులు తదితరులు శాలువాలతో సత్కరించి పుష్ప గుచ్ఛం అందించి మెమొంటో లతో అభినందనలు తెలిపి ఆశీ ర్వాదాలు అందజేశారు భవిష్యత్ లో తన కళా ప్రస్థానం మరింతగా ఎదగాలని కోరారు ఈకా ర్యక్రమంలో కార్యక్రమ కమిటీ సభ్యులు బోగే అశోక్ (తొలిపొద్దు) కండ్లే అంజి గుంపుల రమేష్ కూనమల్ల సుమన్ భూక్యా గంగాధర్ నాయక్ నలువల రాము అమ్మ మధు చరణ్ అలుగునూరి ప్రదీప్ కుమార్ భోధనపు నటరాజ్ సీనియర్ గాయకులు రచయితలు కలకారులు ఎస్వి మల్లిక్ తేజ గడ్డం రమేష్ ఓరుగంటి శేఖర్ అభి పిఎల్ రెడ్డి ఇస్లావత్ కమల్ మహిపాల్ సతీష్ సురేష్ నాయక్ మామిడి మౌనిక దీకొండ శిరీష స్వరాజ్ సందీప్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస తృతీయ వార్షికోత్సవం వెంకటేశ్వరుని వేషాధారణలో ప్రత్యేక ఆకర్షణ


కోరుట్ల అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)



శ్రీనివాస తృతీయ వార్షికోత్సవం పేగు బంధంతో కాదు పేరు బంధం అనే గొప్ప నినాదంతో కోరుట్ల పట్టణ జి ఎస్ కార్డెన్ లో ఆదివారం అట్టహాసంగా ఏర్పాటు చేశారు రాష్ట్ర వ్యాప్తంగా విచ్చేసిన శ్రీనివాసుల ఇట్టి వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు రక్తదాన శిబిరంతో ప్రారంభమైన ఇట్టి వేడుకల్లో సేవా కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు వెంకటేశ్వరుని వేషాధారణలో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీనివాసుల సేవా సంస్థ ద్వారా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవలు అంది స్తున్నామని తల సేమియా బాధితుల కోసం ప్రతి నెల రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నేటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సేఫ్ వాటర్ సేవ్ ప్యూచర్ అనే నినాదం ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు పేగు బంధం లేకపోయినా పేరు బంధంతో ఒక్కటైన శ్రీనివాసులు అంతా పరస్పర ఐకమత్యంతో ముందుకు సాగుతూ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం అభినందనీయమని పేర్కొన్నారు ఈ కార్యక్ర మంలో శ్రీనివాసులు ఆ సేవా సంస్థ వ్యవస్థా పక అధ్యక్షులు ఊట్కూరి శ్రీనివాస్ కోరుట్ల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పడిగేల శ్రీనివాస్ ఆర్గనైజర్లు నీలి శ్రీనివాస్ బెజ్జారపు శ్రీనివాస్ బెజ్జంకి శ్రీనివాస్ రావు పోతుగంటి శ్రీనివాస్ తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శ్రీనివాసుల మిత్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సలలో భాగంగా నగరంలో 20 కి.మీ సైకిల్ ర్యాలీ

కరీంనగర్ ఆక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్స వాలను పురస్కరించుకొని ఆదివారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కరీంన గర్ పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి జెండా ఊపి ప్రారంభిం చారు. ఈ సైకిల్ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉద యం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభ మైన బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగి సిందని సీపీ తెలిపారు.

అక్టోబర్ 31 వరకు వారోత్సవాలు:

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమా లను నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడా నికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఉత్సా హంగా పాల్గొనాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఏసిపిలు వెంకటస్వామి, విజ యకుమార్ కమిషనరేట్ చెందిన ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. వీరితో పాటు కరీంనగర్ కమిష నరేట్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పాసుల, డాక్టర్ కిరణ్, అడ్వకేట్ తిరుపతి పాల్గొన్నారు.

31న కొత్తగూడెంలో ఆవిర్భావ సభ రద్దు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి మెంతన సంజీవరావు తొలగింపు
- తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రాచమోని నాగభూషణం

ఖమ్మం వుదయం బ్యూరో, అక్టోబర్ 25 :

కొత్తగూడెం కేంద్రంగా ప్రకటించిన 31న ఆవిర్భావ సభను రద్దు చేసినట్లు తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు రాచమోని నాగ భూషణం పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భవించి ఈ నెల 9 నాటికి 17 ఏండ్లు పూర్తయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆవిర్భావ సభ జరపాలని రాష్ట్ర కమిటీ నిర్ణయిం చిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఖమ్మం జిల్లా నుండి ప్రధాన బాధ్యతల్లో కొన సాగుతున్న మెంతన సంజీవరావు రాష్ట్ర కమిటీ నిర్ణయాన్ని పక్కకునెట్టి, రాష్ట్ర కమిటీ, జిల్లా కమి టీలతో ఏమాత్రం చర్చించకుండానే కొత్తగూ డెంలో 17వ ఆవిర్భావ సభ కరపత్రం ముద్రించి పంపిణీ చేస్తున్నాడని పేర్కొన్నారు. అందుకే అత్యవసరంగా రాష్ట్ర కమిటీ సమావే శమై సంజీవరావు వైఖరిపై చర్చించినట్లు తెలిపారు. ఈ రాష్ట్ర కమిటీ సమావేశానికి హాజ రవ్వాలని కోరినప్పటికీ కమిటీని బేఖాతరు చేస్తూ సంజీవరావు హాజరు కాలేదన్నారు. తన నియంతృత్వ, మొండి వైఖరి, ఆర్థిక అరాచ కత్వం, టీపీఎఫ్ నియమ నిబంధనావళికి పూర్తిగా విరుద్ధమైనదని రాష్ట్రకమిటీ భావించి ఏకగ్రీవంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి సంజీవరావును తొలగించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం ప్రకటించిన మరుక్షణం నుండి సంజీవరావు రాష్ట్ర, జిల్లా ప్రధాన బాధ్యులను బెదిరింపులకు పాల్పడుతు న్నాడని అన్నారు. ఇప్పటికైనా మెంతన సంజీ వరావు టీపీఎఫ్ విచ్చిన్న కుట్రలు–కుయుక్తులు మానుకొని అక్టోబర్ 17న జరిగిన రాష్ట్ర కమిటీ నిర్ణయానికి కట్టుబడి పని చేయాలని సూచించారు. అక్టోబర్ 31న కొత్తగూడెం సభను రద్దు చేస్తున్నట్లుగా మరొక సారి స్పష్టం చేశారు. సంస్థలో పొడచూపిన సమస్య మొత్తానికి సంజీవరావే బాధ్యుడని, చిన్న చిన్న పొరపాట్లు, విజ్ఞతతో అర్థం చేసుకో వాలని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రజలు ప్రజా స్వామికవాదులు, మేధావులను కోరారు. ప్రజా ఉద్యమం ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా సాధించబడుతుందని విశ్వసించిన పలు జేఏసీలు, సంఘాలు, పార్టీలు, వ్యక్తులతో తెలంగాణ ప్రజాఫ్రంట్ నిర్మాణమైందన్నారు. టీపీఎఫ్ ఒక రాజకీయ ఉద్యమ సంస్థ అని, నాటి టిఆర్ఎస్, కాంగ్రెస్ దోబూచులాట ప్రత్యామ్నాయంగా ప్రజలకు ప్రజాస్వామిక తెలంగాణ సాధన కోసం పోరాట మార్గం చూపిందని పేర్కొన్నారు. అంశాలు, కార్యక్ర మాలు, సవ్యస్థ ప్రాతిపదికగా కలిసి పనిచే సామన్నారు. ఈ మీడియా సమావేశంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లూరి ప్రవీణ్ కుమార్, టిపిఎఫ్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు, భానోత్ రామారావు, గంగపురం సత్తయ్య, సీని యర్ నాయకులు నిమ్మల రాఘవులు, గుంజులూరి కోటయ్య, టీపీఎఫ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రామటెంకి అశోక్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చావా రమేష్, కోశాధికారి దురుసోజు రమేష్ నాయకులు కే,దశరథ, కె.వెంకన్న చారి, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురి బస్‌స్టేషన్ ఆధు నీకరణ పనులకు శంకుస్థాపన

- రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక సౌకర్యాల కల్పన
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రూ. 13 వేల కోట్ల మేర లబ్ది
- 2027 గోదావరి పుష్కరాల కోసం రూ. 226 కోట్లతో అభివృద్ధి పనులు



ధర్మపురి అక్టోబర్25(వుదయం ప్రతినిధి):

ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక సౌకర్యా లతో అభివృద్ధి చేసేం దుకు రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆధునీ కరణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిపొన్నం ప్రభాకర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆదివారం శంకుస్థా పన చేశారు.ప్రయా ణికులకు మెరు గైన వసతులు కల్పిం చేందుకు ప్రాజెక్టులో భాగంగా రెండు ప్లాట్‌ఫారాల విస్తరణ, సీసీ పేవ్‌మెంట్, గ్రానైట్ ఫ్లోరింగ్,భవనానికి ఏసీపీ క్లా డింగ్, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు, రూఫ్ స్లాబ్, సీలింగ్ మరమ్మతులు చేపట్టను న్నారు. అదేవిధంగా వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి,పెయిం టింగ్, పల్లపు ప్రాంతాల్లో కంకర వే య డ ం, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుదీక ర ణ , పంప్‌సెట్‌తో కూడిన బోర్‌వెల్ ఏర్పాటు చే యనున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు రాష్ట్రవ్యా ప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యా న్ని ప్రారంభిం చిందని తెలిపారు.ఇప్ప టివరకు సుమారు 360 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళలకు దాదా పు రూ.13 వేల కోట్ల మేర ఆర్థిక ప్రయో జనం చేకూరిందని పేర్కొన్నారు.ప్రతి గ్రామానికి ఆర్టీ సీ బస్సు సేవలు విస్తరిం చడంతోపాటు బాసర,భద్రాచలం,ధర్మ పురి,గూడెం,కాళే శ్వరం తదితర పుణ్య క్షేత్రాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకుంటోంద న్నారు.ధర్మపురి నుంచి ముం బైకి ఏసీ బస్సు నడిపే ప్రతిపాదనను పరిశీలిం చి,సాధ్యమై నంత త్వరగా అవసరమైన చర్య లు తీసుకో వాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.1993 లో ప్రారంభమైన ధర్మపురి బస్‌స్టే షన్‌ను ఆధునిక అవసరాలకు అనుగు ణంగా అభివృద్ధి చేస్తు న్నామని మంత్రి తెలిపారు.ధర్మ పురిలో బస్ డిపో ఏర్పాటు చే యాలన్న స్థానిక ప్రజల ఆకాం క్షను నెరవేర్చేం దుకు చర్యలు తీసుకుంటామని,ఎన్నికలకు ముందే డిపో నిర్మాణానికి శంకు స్థాపన జరిగే లా సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరినట్లు వెల్లడించారు.2027 లో జరగనున్న గోదావరి పుష్క రాలను దృష్టిలో ఉంచుకొని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాలు,ఘాట్లు, రహదారుల అభివృ ద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్య త ఇస్తోందని తెలిపారు. ధర్మపు రి ఉగ్ర నరసింహ స్వామి ఆల య పునర్నిర్మాణానికి రూ. 10 కోట్లు, పుష్కర ఘాట్లు, బైపాస్ రహ దారులు తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ. 226 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు కృతజ్ఞ తలు తెలిపారు.ప్రముఖ పుణ్యక్షేత్ర మైన ధర్మ పురికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుం టారని,బస్‌స్టేషన్ ఆధునీకరణ తో వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొ న్నారు.ఆలయాలు, ఘాట్లు, రహదా రుల అభి వృద్ధితో పుష్కరాల సమ యంలో భక్తులకు మరింత సౌకర్య వంతమైన వాతావరణం కల్పించవచ్చ ని తెలిపారు.బస్ స్టేషన్ ఆధునీ కరణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చే పట్టి,నాణ్యత విషయంలో రాజీ పడకుండా పూర్తి చేయాలని సంబంధి త అధికారులను ఆదేశించారు. ప్రయా ణికులకు మరు గుదొడ్లు,తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం,వర్షపు నీటి పారు దల వంటి సదు పాయాలు సక్ర మంగా అందుబాటులో ఉండేలా పర్య వేక్షించాలని సూచించారు.సం బంధిత శాఖలు సమన్వ యంతో పనిచేస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిప ల్ చైర్మన్ నాగలక్ష్మి రాజేష్,గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్,ఆర్.టి.సి.అధికా రులు నాగిరెడ్డి,సాలొమాన్,కవిత,రాజు,తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు,కౌన్సిలర్లు,సర్పంచ్ లు,నాయకులు,కా ర్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



నవంబరు 1, 2 తేదీల్లో కట్టంగూరులో నిర్వహణ

నల్లగొండ జిల్లా అక్టోబర్ 25 వుదయం ప్రతినిధి

నల్లగొండ జిల్లా కట్టంగూరులో నవంబరు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీ ఎఫ్) నల్లగొండ జిల్లా విద్యా వైజ్ఞానిక మహాస భలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పిలుపుని చ్చారు. శుక్రవారం నల్లగొండలోని సంఘం జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు బక్కా శ్రీని వాసచారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యావ్యవస్థ బలోపేతం, విద్యార్థులందరికీ నాణ్యమైన ఉచిత విద్య అందించడం వంటి అంశాలపై మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడు తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడేందుకు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామిక విలువ ల పరిరక్షణకు ఉపాధ్యాయులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రెండు రోజులపాటు కార్యక్రమాలు


మహాసభల తొలిరోజు ఎఫ్ఎల్ఎన్–టీ ఎల్ఎం మేళాతోపాటు చైతన్య సదస్సు నిర్వ హించనున్నారు. భారతదేశ ఆర్థిక అభివృ ద్ధిలో మధ్యతరగతి స్థానం అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ కె. నాగేశ్వరరావు, విద్యాసం స్థల్లో విద్యార్థుల అభ్యసన సమస్యలు, పరిష్కార మార్గాలపై ప్రొఫెసర్ డాక్టర్ బెల్లి యాదయ్య ప్రసంగించనున్నారు. రెండో రోజు డీఎస్పీ శివ రాంరెడ్డి చేతుల మీదుగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ప్రతినిధుల సభ, నివేదికల సమర్పణ, చర్చలు, తీర్మానాలు నిర్వహించి జిల్లా నూతన కమిటీని ఎన్నుకోను న్నారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబం ధించిన గోడపత్రికను నాయకులు ఆవిష్కరిం చారు. కార్యక్రమంలో ఎఫ్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర కోశాధికారి ఎడ్ల సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు నర్రా శేఖర్‌రెడ్డి, బడుగు అరుణ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జాల అరుణ, జిల్లా కార్యదర్శులు చిక్కుల రామలింగయ్య, గేర నరసింహ, మోర్తాల శ్రీనివాస్‌రెడ్డి, నలపరాజు వెంకన్న, అడావత్ చిన వెంకన్న, కోట్ల యాదగిరి, పగిళ్ల సైదులు, గంటెల వెంకటయ్య, కొమ్రరాజు సైదులు, గుండా వేదశ్రీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మురళయ్య, సభ్యులు మధు సూదన్‌రెడ్డి, తాటిపాముల నరసింహమూర్తి, భాను ప్రకాష్, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ కన్వీనర్ దాసరి ప్రభాకర్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ గిరి యాదయ్య, సోషల్ మీడియా కన్వీనర్ యరనాగుల సైదులు, స్టడీ సర్కిల్ కన్వీనర్ రాగి రాకేష్‌కుమార్, ఎస్టీఎఫ్ఐ మహిళా కన్వీనర్ గోన శ్రీలత పాల్గొన్నారు.



విద్యుత్ సమస్య తీర్చిన భీమవరం సర్పంచ్ వంట్లా రమేష్

సత్తుపల్లి అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి)

మేంసూరు మండల పరిధిలోని భీమవరం గ్రామపంచాయతీలో సర్పంచ్ వంట్లా రమేష్ ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరం ల నుంచి బంజరు కేబుల్ తో ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు విద్యుత్ శాఖ ఏ ఈ అంకారావు సహకారంతో సర్పంచ్ వంట్లా రమేష్ సూచనల మేరకు కొత్త కండక్టర్ లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎస్సీ కాలనీ లో విద్యుత్ సమస్య లేకుండా పూర్తి చేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



సీతారామచంద్రస్వామివారి అన్నదానానికి రూ.1,04,000 విరాళం

భక్తులకు అన్న ప్రసాద వితరణ కోసం పసుపుల రమేష్ దాతృత్వం

భద్రాచలం 25/10/26 వుదయం ప్రతినిధి

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వా మివారి దేవస్థానంలో స్వామివారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు అన్నప్ర సాద వితరణ కార్యక్రమం నిర్వహించేం దుకు భద్రాచలం పట్టణానికి చెందిన భక్తులు తమ వంతు సహకారం అందిస్తూ ఆధ్యాత్మిక సేవలో భాగస్వా ములవుతున్నారు. ఈ క్రమంలో భద్రాచలం అశోక్ నగర్ కాలనీకి చెందిన శ్రీ పసుపుల రమేష్ గారు శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థా నంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం నిమిత్తం రూ.1,04,000 (ఒక లక్ష నాలుగు వేల రూపాయలు) విరాళంగా అందించారు. శ్రీ సీతారామ చంద్రస్వామివారి సన్నిధిలో భక్తులకు అన్నప్రసాదం అందించడం అత్యంత పవిత్రమైన సేవగా భావిస్తారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, భక్తులకు అన్నప్రసాదం అందించడం భగవంతు నికి చేసే సేవతో సమానమనే భావనతో పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. భద్రాచలం పుణ్యక్షేత్రానికి నిత్యం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. అటువంటి భక్తులకు అన్నప్రసాదం అందించడంలో దాతల సహకారం ఎంతో విలువైనది. ఈ నేపథ్యంలో శ్రీ పసుపుల రమేష్ గారు రూ.1,04,000 విరాళాన్ని అందించడం అన్నదాన కార్య క్రమానికి తోడ్పాటునందించడమే కాకుండా, భక్తి, సేవాభావం, దాతృత్వా నికి నిదర్శనంగా నిలుస్తోంది. భగవం తునిపై భక్తితో సమాజహితాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవా కార్యక్రమా లకు సహకరించడం అభినందనీయ మైన విషయం.

అన్నదానం మహాదానం

భారతీయ సనాతన ధర్మంలో అన్న దానానికి విశిష్టమైన స్థానం ఉంది. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం ద్వారా వారి ఆకలిని తీర్చడమే కాకుండా, మానవత్వం, సేవాభావం, సమానత్వం వంటి విలువ లను చాటిచెప్పవచ్చు. ముఖ్యంగా పుణ్య క్షేత్రాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్ర మాలు భక్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి ఆధ్యాత్మిక తృప్తిని పొందుతారు. శ్రీ పసుపుల రమేష్ గారు అందించిన రూ.1,04,000 విరాళం అన్నదాన సేవ పట్ల ఆయనకున్న భక్తిశ్రద్ధలను, సేవాభా వాన్ని ప్రతిబింబిస్తోంది. ఇలాంటి దాతృత్వ కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినిస్తూ, దేవస్థానంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తోడ్ప డతాయని చెప్పవచ్చు. శ్రీ సీతారామచం ద్రస్వామివారి దివ్య ఆశీస్సులు పసుపుల రమేష్ గారికి, వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లా లని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. స్వామివారి కృపాకటాక్షాలు అందరిపై ప్రసరించాలని కోరుకుంటున్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఆర్థిక భరోసా

- రైతులకు అవగాహన కల్పించిన పతంజలి కంపెనీ ప్రతినిధులు
- నల్గొండ జిల్లా రైతుల సదస్సులో సాగు ప్రయోజనాలపై వివరణ
- పామాయిల్ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురువారెడ్డి



నల్గొండ జిల్లా అక్టోబర్ 25 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో అనిశెట్టిదుప్ప లపల్లి ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిం చడం, రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించడం, దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం పొందే మార్గాలను వివరించే లక్ష్యంతో పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో రైతుల సదస్సు నిర్వహించారు. అని శెట్టిదుప్ప లపల్లిలోని K RRఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సదస్సులో ఆయిల్‌పామ్ సాగు ప్రాధాన్యత, సాగులో ఎదురవుతున్న సమస్యలు, పంట నిర్వహణ పద్ధతులు, దిగుబడి పెంపు మార్గాలపై చర్చించారు.

రైతుల కష్టాలకు పరిష్కారమే లక్ష్యం

ప్రస్తుత వ్యవసాయ రంగంలో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు పెరగడం, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. సంప్రదాయ పంటల సాగులో పెట్టుబడులు పెరిగినా ఆశించిన ఆదాయం రాకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించడం అవసరమని, భూమి, నీటి వనరులు, వాతావరణ పరిస్థితులకు అనుగు ణంగా ఆయిల్‌పామ్ సాగును పరిశీలించా లని సదస్సులో వివరించారు.

ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలిక ప్రయో జనాలు

ఆయిల్‌పామ్ ఒక దీర్ఘకాలిక వాణిజ్య పంట. సరైన భూమి ఎంపిక, అనుకూలమైన వాతావరణం, తగినంత నీటి సౌకర్యం, శాస్త్రీయ సాగు పద్ధతులు పాటిస్తే రైతులు దీర్ఘ కాలికంగా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. పంట పూర్తిస్థాయిలో దిగుబడికి వచ్చిన తర్వాత గెలల రూపంలో ఉత్పత్తి లభిస్తుంది. అయితే దిగుబడి, ఆదాయం అనేవి మొక్కల వయస్సు, నేల స్వభావం, నీటి లభ్యత, ఎరువుల యాజమాన్యం, వాతావరణ పరిస్థి తులు, మార్కెట్ ధరలపై ఆధారపడి ఉంటాయి. ఆయిల్‌పామ్ గెలల నుంచి తీసే పామాయిల్‌కు వంటనూనెల తయారీలో విస్తృ తమైన వినియోగం ఉంది. సబ్బులు, సౌందర్య సాధనాలు, వివిధ పారిశ్రామిక ఉత్పత్తుల తయారీలోనూ పామాయిల్, దాని ఉప ఉత్ప త్తులను ఉపయోగిస్తారు. దీంతో ఈ పంటకు పారిశ్రామికంగా కూడా ప్రాధాన్యత ఉంది.

అవగాహనతోనే అధిక దిగుబడులు

ఆయిల్‌పామ్ సాగులో రైతులు తొందర పడి నిర్ణయాలు తీసుకోకుండా, తమ భూమి స్వభావం, నీటి వసతి, పెట్టుబడి సామర్థ్యం, పంటకు పట్టే సమయం వంటి అంశాలను పరి గణనలోకి తీసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకా లిక పంట కావడంతో ప్రారంభ దశలోనే సరైన ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అందుబాటులో ఉన్న రాయితీలు, కంపెనీ నుంచి లభించే సాంకేతిక సహకారం వంటి వివరాలను సంబంధిత అధి కారుల ద్వారా తెలుసుకోవాలి. రైతుల సమస్య లను పరిష్కరిస్తూ, సాగులో ఆధునిక పద్ధతు లను పరిచయం చేస్తూ, మార్కెటింగ్‌లో భరోసా కల్పిస్తే ఆయిల్‌పామ్ సాగు రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలను అందించగ లదు. పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ రైతుల సదస్సు ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు మరింత అవగాహన కల్పిం చడంతో పాటు, వారి సందేహాలను నివృత్తి చేసి సాగును ప్రోత్సహించేందుకు కృషి చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాజీ మంత్రి జి.చిన్నారెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, పామాయిల్ రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురువారెడ్డి, మేకల ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేళ ప్లేట్‌లెట్స్ దానం.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

48వసారి రక్తదానం.. రెండోసారి ప్లేట్‌లెట్స్ దానం చేసిన వనమా నవీన్ కుమార్

భద్రాచలం 25/10/26 వుదయం ప్రతినిధి



రక్తదానం మహాదానం.. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందించి వారి ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల పాత్ర ఎంతో కీలక మని నిరూపిస్తూ భద్రాచలానికి చెందిన రక్తదాత నవీన్ కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా ప్లేట్‌లెట్స్ దానం చేసి మానవ త్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికే 48వసారి రక్తదానం చేసిన ఆయన, రెండోసారి ప్లేట్‌లెట్స్ దానం చేయడం విశేషంగా నిలిచింది. తన పుట్టినరోజునే అత్యవసరంగా ప్లేట్‌లెట్స్ అవసరమైన రోగికి సహాయం చేసే అవకాశం రావడంతో నవీన్ కుమార్ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా అనుకోకుండా ఒక రోగికి అత్య వసరంగా ప్లేట్‌లెట్స్ అవసరమయ్యాయని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కొప్పుల మురళి వనమా నవీన్ కుమార్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. రోగికి ప్లేట్‌లెట్స్ అత్యవసరంగా అవసరమని తెలియ గానే ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించారు. తన పుట్టినరోజు వేడుకల కంటే ఆపదలో ఉన్న రోగికి సహాయం చేయడమే ముఖ్యమని భావించి స్థానిక రెడ్‌క్రాస్ అసోసియేషన్‌లో ప్లేట్‌లెట్స్ దానం చేశారు. సమయానికి స్పందించి ప్లేట్‌లెట్స్ అందించడం ద్వారా అవసరంలో ఉన్న రోగికి అండగా నిలిచారు. రక్తదానం చేయడం ఒక గొప్ప సేవ కాగా, అత్యవసర సమయంలో ప్లేట్‌లెట్స్ దానం చేయడానికి ముందుకు రావడం మరింత ప్రశంసనీయమైన విషయ మని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్లేట్‌లెట్స్ అవసరమైన రోగులకు సరైన సమయంలో దాతలు అందుబాటులోకి రావడం ఎంతో ముఖ్యం. ఇలాంటి సందర్భాల్లో రక్తదాతలు చూపించే చొరవ రోగుల కుటుంబాలకు ఎంతో ఊరటని స్తుంది. నవీన్ కుమార్ ఇప్పటివరకు 48వసారి రక్తదానం చేయడం ఆయనలోని సేవాభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. అంతేకాకుండా రెండోసారి ప్లేట్‌లెట్స్ దానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సహాయం చేయడంలో తనకున్న నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ, తాను గతంలో రక్తదానం చేసిన నాటి నుంచి ఈరోజుతో 95 రోజులు పూర్తయ్యాయని తెలిపారు. తన పుట్టినరోజునే అనుకోకుండా ఒక రోగికి ప్లేట్‌లెట్స్ అవసరమని సమాచారం అందడం, వెంటనే స్పందించి ప్లేట్‌లెట్స్ దానం చేసే అవకాశం లభించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. పుట్టినరోజు అంటే కేవలం వేడుకలు జరుపుకోవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపడం మాత్రమే కాకుండా, ఆ రోజున అవసరంలో ఉన్న మరొకరికి సహాయం చేయగలిగితే అంతకంటే గొప్ప ఆనందం మరొకటి ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. తన పుట్టి నరోజున ఒక రోగికి ఉపయోగపడే విధంగా ప్లేట్‌లెట్స్ దానం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఒకవైపు పుట్టి నరోజు వేడుకలు, మరోవైపు అత్యవసరంగా ప్లేట్‌లెట్స్ అవసరమైన రోగి.. ఇలాంటి సమయంలో మానవత్వానికి ప్రాధాన్యతనిస్తూ నవీన్ కుమార్ తీసుకున్న నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఆయన, యువత కూడా రక్తదానం పట్ల అవగాహన పెంచుకుని అర్హత ఉన్నప్పుడు స్వచ్ఛందంగా ముందుకు రావాలని తన సేవల ద్వారా సందేశాన్ని అందించారు. . పుట్టినరోజును సేవా దినోత్సవంగా మార్చుకుని, తన సంతోషాన్ని మరొకరికి సహాయం చేసే అవ కాశంగా భావించిన నవీన్ కుమార్‌ను పలువురు అభినందిస్తున్నారు. 48వసారి రక్తదానం చేయడం, రెండోసారి ప్లేట్‌లెట్స్ దానం చేయడం ద్వారా ఆయన తన సేవాభా వాన్ని చాటుకున్నారు.

నిజాయితీకి నిలువుటద్దంగా ఆర్టీసీ సెక్యూరిటీ గార్డు

- రూ.5 వేల నగదుతో కూడిన పర్సు పోగొట్టుకున్న ప్రయాణికుడికి తిరిగి అందజేత
- ఆర్టీసీ సిబ్బంది నిజాయితీని అభినందించిన ప్రయాణికులు
- భద్రాచలం ఆర్టీసీ డీఎం జంగయ్య



భద్రాచలం, 25/10/26 వుదయం ప్రతినిధి:

విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన భద్రాచలం ఆర్టీసీ సెక్యూరిటీ గార్డు తనకు దొరికిన పర్సును పోగొట్టుకున్న ప్రయాణికుడికి తిరిగి అందజేసి ప్రశంసలు అందుకున్నారు. భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం రూ.5 వేల నగదుతో కూడిన పర్సు లభ్యం కాగా, సెక్యూరిటీ సిబ్బంది నిజాయితీగా వ్యవహరించి దానిని సంబంధిత ప్రయాణికుడికి అప్పగించారు. ఆర్టీసీ సిబ్బంది చూపిన నిజాయితీ, బాధ్యతాయుతమైన సేవలు ప్రయాణికుల ప్రశంసలు అందుకున్నాయని భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య తెలిపారు. ఆదివారం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి లగేజీ భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచేందుకు బస్సుల ప్లాట్‌ఫామ్‌ల వద్ద సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు డీఎం జంగయ్య వివరించారు. సెక్యూరిటీ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ ప్రయాణికుల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండ్‌లోని 14వ నంబర్ ప్లాట్‌ఫామ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుకు ఒక పర్సు కనిపించింది. వెంటనే ఆ పర్సును పరిశీలించగా అందులో రూ.5 వేల నగదు ఉన్నట్లు గుర్తించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించిన సెక్యూరిటీ గార్డు పర్సును తన వద్ద ఉంచుకోకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ జంగయ్యకు తెలియజేశారు. మరోవైపు, తన పర్సు పోగొట్టుకున్న ప్రయాణికుడు బస్టాండ్ కంట్రోలర్‌ను సంప్రదించి పర్సు కనిపించడం లేదని సమాచారం అందించారు. దీంతో అధికారులు ప్రయాణికుడి వివరాలను తెలుసుకుని, పర్సు లభ్యమైన విషయం గురించి పరిశీలించారు. పర్సు పోగొట్టుకున్న వ్యక్తికి సంబంధించిన వివరాలను నిర్ధారించుకున్న అనంతరం, దొరికిన పర్సును అందులోని రూ.5 వేల నగదుతో సహా సదరు ప్రయాణికుడికి తిరిగి అప్పగించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- పట్టభద్రుల ఓటు నమోదు నుంచి పోలింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కల్లూరు,అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేయాలని, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కల్లూరు బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, మహిళలకు స్కూటీల పంపిణీ వంటి హామీలపై యువత, మహిళల్లో అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. రైతులకు సాగునీటి సమస్యలు, నాణ్యమైన విద్యుత్ కొరత, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు కొనసాగుతున్నాయని విమర్శించారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు.. ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు

నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సండ్ర అన్నారు. బియ్యం ధరలు పెరగడం కుటుంబాల ఆర్థిక భారాన్ని మరింత పెంచుతోందని పేర్కొన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.

పట్టభద్రుల ఓటే విజయానికి కీలకం

ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవాలని సండ్ర వెంకటవీరయ్య సూచించారు.



అర్హులైన పట్టభద్రులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించాలని, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ హామీలు, నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగుల ఇబ్బందులు, రైతుల కష్టాలు, పెరుగుతున్న ధరలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతీఒక్కరు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పీటీసీ సభ్యులు కట్టా అజయ్ కుమార్, డాక్టర్ లక్కినేని రఘు, పుర కౌన్సిలర్లు, పెదకంటి రామకృష్ణ, కనపర్తి శ్యామల రాజ్ కుమార్,ఇస్మాయిల్, ఇంతియాజ్, దార్ల నరసింహారావు,వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్ నినో కారణంగా తీవ్ర సంక్షోభం ఏర్పడిందని ఇది ప్రకృతి వైపరీత్యం

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 25

జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా కాంగ్రెస్ ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల అధ్యక్షతన నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ముఖ్య అతిథిలుగా హాజరైన ఏ పి సి సి ఉపాధ్యక్షులు, ఓట్ బచావో కార్యక్రమ ఏ ఐ సి సి అబ్జర్వర్ ఖమ్మం క్లస్టర్ ఇంచార్జి వేగి వెంకటేష్, టి పి సి సి ప్రధాన కార్యదర్శి, సర్ కార్యక్రమ ఖమ్మం జిల్లా ఇంచార్జి దుద్దిళ్ళ శ్రీనుబాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో కారణంగా తీవ్ర సంక్షోభం ఏర్పడిందని ఇది ప్రకృతి వైపరీత్యం. దీనిపై గ్రామ గ్రామాన రైతులకు ప్రజలకు ఎల్ నినో పై అవగాహన కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని ప్రతి కార్యకర్త సామాజిక సేవా దృక్పథంతో ప్రజల్లోకి వెళ్లాలనీ,అవగాహన కల్పించాలని కోరారు.

సర్ ప్రక్రియపై – రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా:

కేంద్రంలోని మోదీ, అమిత్ షా, బిజెపి ప్రభుత్వం సర్ పేరుతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోంది. బడుగు, బలహీన, గిరిజన వర్గాల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని దీనిపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇండియా కూటమితో కలిసి పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా నవంబర్ 01న ఢిల్లీ రాంలీలా మైదానంలో జరిగే భారీ ర్యాలీకి ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలివచ్చి ర్యాలీని జయప్రదం చేయాలని దిశా నిర్దేశం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు:

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల




ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యం. అందుకోసం ఓటర్ నమోదును వేగవంతం చేయాలి. జిల్లాలోని అనుబంధ సంఘాల అధ్యక్షులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలని తద్వారా ఓటు బదలాయింపు కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో వీరితో పాటు సుడా చైర్మన్ ఖమ్మం జిల్లా సర్ కో ఆర్డినేటర్ లు చక్కిలం రాజేశ్వరరావు, దైదా రవీంద్ర, నాగ సీతారాములు,లోకేష్ యాదవ్ మధిర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి లు శాసన మండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, టి పి సి సి ప్రధాన కార్యదర్శి పాలేరు నియోజకవర్గ ఇంచార్జి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సంతోష్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, వేజెండ్ల సాయికుమార్, సయ్యద్ గౌస్,పుచ్చకాయల వీరభద్రం, బొద్దు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ ,కార్పొరేషన్ కమిటీ సభ్యులు కోసూరి ప్రసాద్, ఏలూరి శ్రీనివాస్,పాలకుర్తి నాగేశ్వర రావు,లక్ష్మీనారాయణ తదితర నాయకులు పాల్గొన్నారు.



దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్ 25

కుమ్మరి గూడెం వైపు ఒడ్డు నుండి దుమ్ముగూడెం అవతల ఒడ్డుకు బోటులో చేరుకున్న తుమ్మల. ఎల్ నినో ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు.. ఆనకట్ట పైన ఒక మీటర్ ఎత్తున ఏర్పాటు చేస్తున్న ఇసుక బస్తాల పనులు పరిశీలన. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి

- అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ సభలో నూతన కార్యవర్గం ఎన్నిక
- అధ్యక్షుడిగా రంగరాజు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ నజీర్

నల్గొండ జిల్లా అక్టోబర్ 25, వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవ సభ నల్లగొండలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా జీపీఓల సంఘం అధ్యక్షుడు ఎస్కే జానిమియర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర జీపీఓల సంఘం అధ్యక్షుడు గరిక ఉపేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ పాలన అధికారుల వ్యవస్థ ఏర్పాటులో విశేష కృషి చేసిన రాష్ట్ర జేఏసీ నాయకుడు లచ్చిరెడ్డి, రాష్ట్ర జీపీఓల సంఘం అధ్యక్షుడు గరిక ఉపేంద్రరావుకు సభలో కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం: అధ్యక్షుడిగా రంగరాజు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ నజీర్, మహిళా అధ్యక్షురాలిగా గట్టుపల్లి సబితారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఉబ్బని యాదగిరి, కోశాధికారిగా కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా పోలే రామస్వామి, జిల్లా కన్వీనర్‌గా జి. మహేందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఈద శ్రీనివాస్, భద్రంరాజు, నీరజ, మహమ్మద్ జహంగీర్ అలీ, చింతపల్లి నాగయ్య; కార్యదర్శులుగా కంచర్ల శ్రీనయ్య, ఎర్జాల భాస్కర్, బొల్లెద్దు లింగస్వామి; ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా దుబ్బ యాదయ్య, బల్లెం అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. సమావేశంలో గ్రామ పాలన అధికారులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న బదిలీల సమస్యతో పాటు ఆరు, 12, 18, 24 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ప్రత్యేక గ్రేడ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాల్సిన అంశాలపై చర్చించారు.

డిండి ప్రాజెక్టుకు 0.6 టీఎంసీల నీటి కేటాయింపు హర్షణీయం

- పాలమూరు–రంగారెడ్డికి జాతీయ హోదా సాధించాలి
- నల్గొండ, మహబూబ్‌నగర్ రైతుల ప్రయోజనాలే ముఖ్యం
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్గొండ జిల్లా అక్టోబర్ 25 వుదయం ప్రతినిధి

నల్గొండ పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, డిండి ఎత్తిపోతల పథకానికి 0.6 టీఎంసీల నీటిని కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందడుగని పేర్కొన్నారు. నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలంటూ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు సరికావని గుత్తా అన్నారు. ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించకుండా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా సాధించేందుకు ఆమె కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సమకూరేలా చూడాలని కోరారు. డిండి ప్రాజెక్టుకు నీటి కేటాయింపుపై నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు ప్రయోజనం డిండి ఎత్తిపోతల పథకం కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ప్రజలకు ఉపశమనం కల్పించడంలో కీలకమని చెప్పారు. ఆయా ప్రాంతాలకు సురక్షితమైన నీటిని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు వివరించారు. నీటి వనరుల విషయంలో ప్రాంతాల వారీగా విభేదాలు సృష్టించడం సమంజసం కాదన్నారు. ఒక జిల్లా నీటిని ఆ జిల్లాలోనే వినియోగించుకోవాలనే వాదన సరైంది కాదని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తే తెలంగాణకు కర్ణాటక నుంచి నీరు రాని పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. ఏఎంఆర్‌పీ ద్వారా హైదరాబాద్‌కు 30 టీఎంసీల నీటిని అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగంపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సుమారు 10 లక్షల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యం



ఉందని గుత్తా తెలిపారు. ఇందులో 7.78 లక్షల ఎకరాలకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ, ఉదయసముద్రం, డిండి, దేవాదుల తదితర ప్రాజెక్టుల ద్వారా 7.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, పనులు పూర్తిస్థాయిలో పూర్తి కాలేదన్నారు. గత ప్రభుత్వాలు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వెచ్చించిన నిధుల్లో సగం కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు కేటాయించి ఉంటే అనేక పనులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు ప్రత్యేక ఆయకట్టు లేదని, టన్నెల్ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా లిఫ్ట్ ద్వారా నీటిని అందించే ప్రతిపాదన ఉందని తెలిపారు. రైతులకు త్వరగా సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలన్నారు.

పాలమూరు రైతులకూ సాగునీరు అవసరం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉండగా, 8.50 లక్షల ఎకరాలకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని గుత్తా వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం కృషి చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులను అభినందించారు. పార్టీలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల నీటి లభ్యతపై ఏర్పడే పరిస్థితులను ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారని తెలిపారు. కృష్ణా బేసిన్‌లోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేయాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు.

కాళేశ్వరం వైఫల్యంపై తెలంగాణ ప్రజలకు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా. వుదయం ప్రతినిధి

హైదరాబాద్‌లోని CLP కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు శ్రీ వేముల వీరేశం గారితో కలిసి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ: మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిపై నోటికొచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని, ముందు బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పాలని హితవు పలికారు. రూ.30 వేల కోట్ల అంచనాలతో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి నిర్మించినా, చివరకు అది కూలేశ్వరం అయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయవద్దని NDSA స్పష్టంగా సూచించిందని పేర్కొన్నారు. కన్నెపల్లి పంపులను ఆన్ చేయాలని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని, పంపులు కనీసం పది గంటల పాటు కూడా నడిచే పరిస్థితి లేదని విమర్శించారు. కమీషన్ల కోసమే డిజైన్లు మార్చి, సెకండ్ ఫైల్స్ విధానంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలోనే ప్రాజెక్టు ఎందుకు కుంగిపోయిందో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి ఉంటే తెలంగాణ సస్యశ్యామలంగా మారేదని అన్నారు. కమీషన్లు రావనే ఉద్దేశంతోనే కేసీఆర్ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని విమర్శించారు. నల్గొండ జిల్లాతో పాటు



రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజంగానే ఉత్తముడని వారి పనితీరును ప్రశంసించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను పక్కనపెట్టి అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. నీటి వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బొగ్గు లభ్యత లేని ప్రాంతంలో యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టును నిర్మించి నష్టానికి కారణమయ్యారని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రజాధనాన్ని వృథా చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యానికి కారణమైన నాయకులే తిరిగి ఆ ప్రాజెక్టును తమకు అప్పగించాలని కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇంకా బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు స్పష్టం చేశారు.

ఐటీడీఏ గిరిజన దర్బార్, ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

- గిరిజనులు, ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలి
- ఐటీడీఏ పీఓ బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ

భద్రాచలం, 25 /10/26 వుదయం ప్రతినిధి:

భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం, అక్టోబర్ 26వ తేదీన నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సూచించారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ప్రజలు తమకు సంబంధించిన సమస్యలు, వినతులు, ఫిర్యాదులను స్పష్టంగా లిఖితపూర్వకంగా సిద్ధం చేసుకుని సంబంధిత కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులు తగిన పరిశీలన జరిపి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. గిరిజనులు, ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ



మందిరంలో నిర్వహించే గిరిజన దర్బార్‌కు అన్ని ఐటీడీఏ యూనిట్ అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ స్పష్టం చేశారు. అదేవిధంగా, సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత డివిజన్ అధికారులు సమయానికి హాజరుకావాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తెలిపారు. ప్రజలు అందించే ఫిర్యాదుల స్వీకరణ, వాటికి సంబంధించిన అంశాల పరిశీలన, సంబంధిత శాఖల ద్వారా చేపట్టాల్సిన చర్యల విషయంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండటం అవసరమని పేర్కొన్నారు. కావున, అక్టోబర్ 26వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న గిరిజన దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి పొంగులేటికి ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జేఏసీ నాయకుల వినతి

ఖమ్మం వుదయం బ్యూరో , అక్టోబర్ 25:

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా ఎన్ హెచ్ ఎం జేఏసీ నాయకులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు . రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టడానికి గల కారణాలను మరియు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు . రాష్ట్రంలో సుమారు 17,600 మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ , ఉద్యోగ భద్రత , వేతనాలు , వైద్య సదుపాయాలు , ఇతర సేవా ప్రయోజనాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు . ఉద్యోగ భద్రత కల్పించడం , సమాన పనికి సమాన వేతనం అమలు , మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు , ఈ హెచ్ ఎస్ ద్వారా నగదు రహిత వైద్యం , ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాల చెల్లింపు వంటి డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు . అలాగే వార్షిక 5 శాతం ఇంక్రిమెంట్ , 8 శాతం లాయల్టీ బోనస్ , 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిల



చెల్లింపు , రూ.20 లక్షల గ్రాట్యుటీ , ఉద్యోగి మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు . ఔట్‌సోర్సింగ్ విధానంపై పునఃపరిశీలన చేసి ఉద్యోగులను స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు . గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర ఆరోగ్య సేవలు అందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి , న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలని నాయకులు కోరారు . ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ నాయకులు డాక్టర్ మాధవి , రఘురామ్ , డాక్టర్ వెంకట్‌లాల్ , డాక్టర్ వి.వి.రావు , డాక్టర్ మనోజ్ , డాక్టర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు .

దివ్యాంగుల హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీజేపీ రాష్ట్ర దివ్యాంగుల విభాగం కో-కన్వీనర్ గోలి ప్రభాకర్

నల్గొండ, జిల్లా అక్టోబరు 25 వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దివ్యాంగుల హక్కుల చట్టం–2016ను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల విభాగం కో–కన్వీనర్ గోలి ప్రభాకర్ డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం రాష్ట్రస్థాయిలో సలహా మండలిని, జిల్లాస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా దివ్యాంగుల విభాగం కన్వీనర్ రాపోలు సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో తగిన కమిటీలు లేకపోవడంతో దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో వాటా కల్పించాలి

ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లలో అర్హులైన దివ్యాంగులకు నిబంధనల ప్రకారం ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభాకర్ కోరారు. నల్గొండ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరుపేద దివ్యాంగులకు పారదర్శకంగా ఇళ్లను కేటాయించి, వారి సొంతింటి కలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్గొండ జిల్లా కేంద్రంలో నిరుపేద దివ్యాంగులకు ఉచితంగా వస్త్రాలు, సహాయక పరికరాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు గోలి ప్రభాకర్ వెల్లడించారు. దివ్యాంగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తమ విభాగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో జిల్లా కో–కన్వీనర్ ముంత మల్లేష్ యాదవ్, యాదగిరి తదితరులతో పాటు జిల్లాలోని వివిధ మండలాల దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, బీజేపీ దివ్యాంగుల విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పేదింటి బిడ్డకు నార్కట్పల్లి కామినేని మెడికల్ కాలేజీలో డాక్టర్ సీటు

తల్లిదండ్రులు కట్ట ప్రసన్న రాణి లక్ష్మణ్ తమ్ముడు అభినయ్ ఆనందం, కుటుంబ సభ్యులు సంతోషం

నల్గొండ జిల్లా అక్టోబర్ 25 వుదయం ప్రతినిధి

నల్లగొండ పట్టణ కేంద్రంలో కట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ వైపు ఉన్న శ్రీనగర్ కాలనీలో కొన్ని సంవత్సరాల క్రితం వచ్చి ఇక్కడనే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఎంతో కష్టపడి తనకు చదువు మీద ఉన్న మక్కువతో పిల్లల్ని బాగా చదివించాలని ఆలోచనతో తన కూతుర్ని బాగా చదివించి నేడు డాక్టర్ సీటు రావడం తనకు గర్వంగా ఉందని తన మాటల్లో తెలుపుతూ నార్కట్‌పల్లి మండలం తొండ్లాయి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఓ విద్యార్థిని పట్టుదలతో చదివి వైద్య విద్యకు అర్హత సాధించిన కట్ట అనువర్ధిక డాక్టర్ సీటు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది.

గ్రామానికి చెందిన కట్ట ప్రసన్న రాణి, లక్ష్మణ్ దంపతుల కుమార్తె అనువర్ధిక మొదటి తరగతి నుంచి నాలుగవ తరగతి నార్కట్పల్లి మండలంలో శ్రీ చేతన పాఠశాలలో చదివి తదుపరి నల్లగొండ పట్టణంలో గంధ వారి గూడెం సోషల్ వెల్ఫేర్ లో సీటు సాధించి అక్కడ



ఐదవ తరగతి ప్రవేశించి ఐదో తరగతి ఇంటర్మీడియట్ పరీక్షలో 958 మార్కులు సాధించి విద్యాభ్యాసం పూర్తి అక్కడనే చేసి చదువుతూ వైద్య విద్యలో సీటు సాధించడమే లక్ష్యంగా మూడేళ్లపాటు కష్టపడి చదివింది. ఆమె శ్రమ, పట్టుదల ఫలించి వైద్య విద్యకు ఎంపికైంది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి వైద్య విద్యకు ఎంపిక కావడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు తాత అమ్మమ్మ గోలి రాములు సుజన బాబాయ్ పిన్ని కట్ట నరసింహ రేవతి బాబాయి పిన్ని సల్వాద్రి కృష్ణ శారద బాబాయ్ పిన్ని నూక బత్తిని రమేష్ జ్యోతి బాబాయ్ పిన్ని బుంగ సతీష్ మౌనిక తమ్ముళ్లు చెల్లెళ్లు రక్తసంబంధులు బంధుమిత్రులు స్నేహితులు అభినందించారు

గో మాంసం, వరాహ మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

తేగడ సర్పంచ్ జమ్ముల మురళి హెచ్చరిక

చర్ల, అక్టోబర్ 25: (వుదయం ప్రతినిధి)

తేగడ గ్రామ పంచాయతీ పరిధిలో గోమాంసం, వరాహ మాంసం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తేగడ సర్పంచ్ జమ్ముల మురళి హెచ్చరించారు. గ్రామ పరిధిలో ఇలాంటి విక్రయాలు, వాటి ద్వారా ఏర్పడే వ్యర్థాల పారవేతపై ఇకపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. గోమాంసం విక్రయాల అనంతరం మిగిలిపోయిన వ్యర్థాలను తాలిపేరు నదిలో పడవేస్తున్నారని, ఈ విషయంపై పలుమార్లు హెచ్చరించినా మార్పు రావడం లేదని సర్పంచ్ పేర్కొన్నారు. తాలిపేరు నది నుంచి చెలిమల ద్వారా సేకరించే నీటిని తేగడ గ్రామ ప్రజలు



తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో నదిలో మాంసం వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తేగడ గ్రామ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ జమ్ముల మురళి చేసిన ఈ పనికి గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చర్ల మండల పరిధిలోని అన్నీ పంచాయతీల్లో సర్పంచ్ లు ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి వినతిపత్రం

నల్గొండ జిల్లా అక్టోబర్ 25 నల్గొండ వుదయం ప్రతినిధి


నల్గొండ పట్టణ కేంద్రంలో నేడు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డినీ తన గృహంలో జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరుతూ ఉద్యోగుల ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సమాన పనికి సమాన వేతనం కల్పించాలి

ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల మధ్య వేతనాల్లో వ్యత్యాసాలు లేకుండా చూడాలని, సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని అమలు చేయాలని ఉద్యోగులు కోరారు. దీర్ఘకాలంగా తమ సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నామని, ప్రభుత్వం తమ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన పరిష్కారం చూపాలని కోరారు. ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తగ్గించడంతో పాటు, ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగుల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య సేవల్లో నిరంతరం పనిచే



స్తున్న తమకు న్యాయం జరిగితే మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సమాన పనికి సమాన వేతనం అమలు దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రమేష్, ఆడియాలజిస్టులు అనిల్, సంతోష్, డాక్టర్ వెంకటేశం, ల్యాబ్ టెక్నిషన్ సురేష్ ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వుదయం

భూముల రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి

సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)25 అక్టోబర్ 2026

భూముల రీసర్వే మొదటి దశ ప్రక్రియను వేగవంతం చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వే ప్రక్రియ పురోగతిపై శనివారం సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. భూ రీసర్వే మొదటి దశలో అన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాలలో సర్వే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్వే పనులకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకొని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, యంత్ర పరికరాలను సమకూర్చుకొని నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. సర్వే పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పనుల పురోగతికి అనుగుణంగా బృందాలను కేటాయించాలని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రతిరోజూ చేపట్టిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను సమీక్షించాలని చెప్పారు. సర్వే పనుల్లో వెనుకబడిన గ్రామాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి సారించి పనుల వేగం పెంచాలని తెలిపారు. భూ రీసర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. భూ సరిహద్దులకు సంబంధించిన సమస్యలు, భూ రికార్డుల్లో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణకు ఆటంకాలు ఏర్పడకుండా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అవసరమైన చోట సంబంధిత భూయజమానులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వాటి పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ రీసర్వే పనులకు అవసరమైన యంత్ర పరికరాలు, సాంకేతిక పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలను జిల్లా స్థాయిలో ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. సర్వే బృందాలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరికరాల కొరత కారణంగా పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.



భూ రీసర్వే పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. భూ రీసర్వే ప్రక్రియ ద్వారా భూములకు సంబంధించిన వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి దశలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియ వివరాలను కమిషనర్ కు తెలియజేశారు. ఇటీవల అదనపు సర్వే యంత్రాలు సమకూర్చుకున్నట్లు వివరించారు. రీ సర్వే ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు. జిల్లాలో సంబంధిత అధికారుల సమక్షంలో రీ సర్వే ప్రక్రియ సజావుగా జరుగుతుందని చెప్పారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి సర్వేను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్ విఠల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు జోరు - యువతలో ఉత్సాహం

- **స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటు నమోదు చేసుకుంటున్న గ్రాడ్యుయేట్లు**
- **మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి ఫారాలు అందజేత**

ఉమ్మడి నల్గొండ, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):



గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నల్గొండ పట్టణంలో ఓటు నమోదు ప్రక్రియ జోరందుకుంది. నల్గొండలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కార్యక్రమానికి పట్టణానికి చెందిన పలువురు యువకులు, విద్యావంతులు స్వచ్ఛందంగా తరలివచ్చి తమ ఓటును నమోదు చేసుకున్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి నివాసంలో ఓటు నమోదు చేసుకున్న యువత మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఫారాలను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ యువతను అభినందించారు. "యువత చైతన్యవంతంగా ఆలోచన చేయాలి. మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాల్సిన అవసరం ఉంది. గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి" అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.


యువ మేదరి మహేంద్ర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



జన్నారం,అక్టోబర్ 25 (వుదయం విలేఖరి)

యువ మేదరి మహేంద్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం రోజున సంఘ సభ్యుల సమక్షంలో ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ఒడిపెల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా చింత రమణ, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్ లు ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మహేంద్ర సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో మహేంద్ర సంఘం అధ్యక్షులు ఎమ్మార్ నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరి నర్సయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూరినేని కొండయ్య, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంద గోపాల్, మాజీ గౌరవ అధ్యక్షులు పర్ల శంకర్, మాజీ అధ్యక్షులు సంద కృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి చిలువేరి సుధీర్ కుమార్, మదిరె సతీష్, కనికరపు రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూమిపై ఆరుగురి కన్ను



- **యజమానిని బెదిరించిన వైనం**
- **మామిడి చెట్లు తొలగించి ప్లాట్లుగా మార్పు**
- **రూ.4.50 లక్షలకు విక్రయించేందుకు యత్నం**
- **ప్రతిపక్షం అండతోనే తెరవెనుక వ్యవహారం**

జైపూర్, అక్టోబర్ 25(వుదయం విలేకరి)

అసైన్డ్ భూమిపై కన్నేసిన ఆరుగురు వ్యక్తులు భూమిని స్వాధీనం చేసుకుని ప్లాట్లుగా మార్చిన వ్యవహారం తెలిసిన అధికారుల పట్టింపు చర్యలు లేకపోవడం ప్రజల్లో అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. జైపూర్ మండలంలోని సాగర్‌రావు బిల్డింగ్ సమీపంలో ఉన్న భూమి యజమానిని బెదిరించి స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం భూమిలో ఉన్న మామిడి చెట్లను తొలగించి ప్లాట్లుగా మార్చి ఆ భూమిని రూ.4.50 లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అసైన్డ్ భూమి కావడంతో అధికార పార్టీకి సంబంధం లేకుండా ప్రతిపక్షం లో ఉన్న వ్యక్తి అండ దండలతో భూమి యజమాని బెదిరించి ఆ భూమిని లాక్కున్నారు, భూ వ్యవహారం వెనుక ప్రతిపక్ష వ్యక్తి అండతో నడిచింది. అధికార పార్టీకి సంబంధం లేకుండానే తెరవెనుక వ్యవహారం సాగినట్లు తెలుస్తోంది. భూమి యజమానిపై ఒత్తిడి తెచ్చి భూమిని స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

అధికారుల విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి

అసైన్డ్ భూమి స్వాధీనం, మామిడి చెట్ల తొలగింపు, ప్లాట్లుగా విభజన, విక్రయ ప్రయత్నాలపై సంబంధిత రెవెన్యూ అధికారులు దృష్టి సారించాలి. భూమి రికార్డులను పరిశీలించి, అసైన్డ్ భూమికి సంబంధించిన నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనే అంశాన్ని నిర్ధారించాలి. అక్రమాలు జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో ఆరుగురి పాత్ర, భూమి స్వాధీనం వెనుక ఉన్న పరిస్థితులు, ప్రతిపక్ష వ్యక్తి ప్రమేయంపై విచారణ చేపడితేనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం

- **28 యూనిట్ల రక్తం సేకరణ**
- **రక్తదాతలను అభినందించిన దోమకొండ ఎస్సై ప్రభాకర్**

కామారెడ్డి, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):-



దోమకొండ మండల కేంద్రంలో ఉగాది సిండికేట్, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారి కోసం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దోమకొండ ఎస్సై ప్రభాకర్, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తూ ఆదర్శంగా బాలె సురేందర్, మ్యాక నాగరాజుల ను అభినందించి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల యూనిట్లకు పైగా చిన్నారులు తల సేమియా వ్యాధితో బాధపడుతున్నారని ఈ చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం వారి జీవితాంతం అవసరం ఉంటుందని వారి ప్రాణాలను కాపాడడానికి యువత రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని రక్తదాన శిబిరాలకు కావలసిన పూర్తి సహాయ సహకారాలను కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ఇండియన్, రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో అందజేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి చిన్నారుల ప్రాణాలను కాపాడడానికి కృషి చేస్తామని అన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవని మానవతా దృక్పథంతో ముందుకు వస్తేనే సకాలంలో రక్తాన్ని అందజేసి ప్రాణాలను కాపాడగలుగుతామని రక్తదాన శిబిరంలో పాల్గొనే రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను, స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు అందె గణేశ్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది బట్టు భరద్వాజ్, డాక్టర్ అజయ్, టెక్నీషియన్లు సతీష్, గౌతం, భరత్ లు పాల్గొన్నారు.

చింతగూడ గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్ విరాళం

జన్నారం,అక్టోబర్ 25 (వుదయం విలేఖరి)



చింతగూడ గ్రామానికి చెందిన జడ్పీ పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు సేవాభావం చాటుకున్నారు. సేవే మన ధర్మం, సహాయమే మన లక్ష్యమనే సదుద్దేశంతో గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో ఉపయోగపడేలా డెడ్ బాడీ ఫ్రీజర్ ను విరాళంగా అందించారు.2001-2006 లో చింతగూడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుకున్న మిత్రబృందం - ఆపన్న హస్తం పేరిట ఆదివారం సర్పంచ్ సుతారి సుమలత సమక్షంలో గ్రామపంచాయతీకి ఫ్రీజర్ ను అప్పగించారు. 2001 నుంచి 2006 వరకు చదువుకున్న విద్యార్థులు చేపట్టిన ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని సర్పంచ్ అన్నారు.మనమంతా కలిసి చేసే చిన్న సహాయం కూడా ఎంతోమందికి పెద్ద అండగా నిలుస్తుందని, స్నేహం, మానవత్వం, సేవాభావంతో చేసిన ఈ చిన్న ప్రయత్నం గ్రామానికి ఉపయోగపడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని మిత్రబృందం తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ షాక్!

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన భార్గవ్ దేశ్‌పాండే

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 25 :



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. కేటీఆర్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన భార్గవ్ పార్టీ మారడం ఉమ్మడి జిల్లాలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామం కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బగా, బీఆర్ఎస్‌కు కొత్త అవకాశంగా మారింది.

అనుభవం.. నాయకత్వ పటిమ.. గులాబీ పార్టీకి కొత్త బలం!

విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన భార్గవ్ దేశ్‌పాండే ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. విద్యార్థి రాజకీయాల నుంచి జిల్లా స్థాయి నాయకత్వం వరకు సాగిన ఆయన ప్రస్థానం సుదీర్ఘ రాజకీయ అనుభవానికి నిదర్శనం.

అగ్రనేతల సమక్షంలో చేరిక

భార్గవ్ దేశ్‌పాండే చేరిక కార్యక్రమంలో మాజీ మంత్రులు జోగు రామన్న, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి , అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ అగ్రనేతల సమక్షంలో జరిగిన ఈ చేరికతో జిల్లాలో పార్టీ నాయకత్వానికి కొత్త రాజకీయ అండ లభించినట్లయింది. ఆయన అనుభవాన్ని పార్టీ కార్యక్రమాలకు అనుసంధానించగలిగితే క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుంది.

రైతు గర్జనకు ముందు రాజకీయ సమీకరణాలు!

భార్గవ్ దేశ్‌పాండే చేరికతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ రాజకీయ వ్యూహాలకు కొత్త ప్రాధాన్యత ఏర్పడింది. ఆయనకు ఉన్న రాజకీయ పరిచయాలు, జిల్లా వ్యవహారాలపై అవగాహన పార్టీ విస్తరణకు దోహదపడవచ్చనే అంచనాలు ఉన్నాయి. మరోవైపు, నవంబర్ 1న జరగనున్న రైతు గర్జన సభ ద్వారా రైతుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలాన్ని చాటుకోవాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో భార్గవ్ చేరిక పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచే పరిణామంగా నిలవనుంది. రానున్న రోజుల్లో ఈ కొత్త రాజకీయ సమీకరణాలు ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ఏ మేరకు కలిసివస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.



పోచమ్మ పండుగ వేడుకల్లో బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 25 :

ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం బండల నాగాపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి నిర్వహించిన పోచమ్మ పండుగ వేడుకలకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీధర్ రెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ, తాంసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడల సంతోష్, కప్పర్ల ఉపసర్పంచ్ నర్సింలు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్న యాదవ్, సంజీవ్, సీనియర్ నాయకులు ససానే మాధవ్, బుక రాములు, యండి సద్దాం, సతీష్ రెడ్డి, సుభాష్ రెడ్డి, ప్రభాకర్, బాపురెడ్డి, ఆత్మ డైరెక్టర్ కేమ హనుమండ్లు, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 25 :

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో మార్చ్ నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. సేవాదళ్ కార్యక్రమాలు కార్యకర్తల్లో క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మోతీ రామ్, జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి బెజ్జంకి అనిల్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖిజర్ పాషా, సేవాదళ్ జిల్లా జనరల్ సెక్రటరీ అఫ్సర్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




గూడెం నుండి శబరిమలకు మహా పాదయాత్ర

దండేపల్లి అక్టోబర్ 25 (వుదయం విలేఖరి)

అభినవ శబరిమల గూడెం అయ్యప్ప దేవాలయం నుండి శబరిమలకి మహా పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములు ఆదివారం ఉదయం గూడెం అయ్యప్ప దేవాలయం నుండి కేరళ రాష్ట్రంలోని శబరిమల దేవాలయంకు గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమాచార్యులు చేతుల మీదుగా మాల ధరించి గడప నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో పెద్దూరి భాస్కర్, మొరుపుటాల సంజీవ్, అలిశెట్టి అరుణ్ కుమార్ మరియు బుద్దె వెంకటేష్ స్వాములు పాదయాత్రగా బయలుదేరారు. వీరు మంచిర్యాల,హైదరాబాద్, బెంగుళూరు, కోయంబత్తూరు,ఎరుమేలి,పంబా మీదుగా శబరిమల చేరుకుంటారు.

28న టేకు కలప బహిరంగ వేలం

జన్నారం,అక్టోబర్ 25 (వుదయం విలేఖరి)



జన్నారం ప్రభుత్వ కలప డిపోలో బుధవారం రోజున టేకు కలప బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతీ నెల 23న జరగనున్న కలప వేలం పాటను అనివార్య కారణాలవల్ల ఈనెల 28న అటవీ శాఖ ఆధ్వర్యంలో వేలంలో కలప విక్రయానికి ఉంచనున్నట్లు తెలిపారు. మన ప్రాంతానికి చెందిన నాణ్యమైన టేకు కలపను తక్కువ ధరకు కొనుగోలు చేసుకునే అరుదైన అవకాశమని, నిర్మాణ పనులు, ఫర్నిచర్ తయారీ, కలప ఆధారిత పరిశ్రమల అవసరాల కోసం కలప కొనుగోలు చేయదలచిన వ్యాపారులు, కొనుగోలుదారులు మరియు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్డీవో కోరారు.

సూర్యాపేటలో ఘనంగా 'స్వర గానామృతం' కార్యక్రమం



- **111 పాటలతో అలరించిన గాయనీ గాయకులు**
- **కళల వల్లే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుంది: డా. రామ్మూర్తి యాదవ్**

సూర్యాపేట, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):


సూర్యాపేట పట్టణంలోని బాబు జగ్జీవన్ రావు భవన్ లో జ్ఞాన సరస్వతి కళా వేదిక ఆధ్వర్యంలో 'స్వర గానామృతం' కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. జూనియర్ ఘంటసాల అలియాస్ బుర్రి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 111 పాటలతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గాయనీ గాయకులు తమ గానామృతంతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. రామ్మూర్తి యాదవ్, జైలు సూపరింటెండెంట్ సుధాకర్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు హమీద్ ఖాన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చిన్న శ్రీరాములు, భారత్ గ్యాస్ డీలర్ ఇరిగి కోటేశ్వరి, స్పెడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ దయానంద్, బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డా. రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ, కళల వల్లే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని అన్నారు. కళల్ని, కళాకారులను ప్రోత్సహిస్తూ గౌరవించడం సూర్యాపేట ఘనత అని కొనియాడారు. జ్ఞాన సరస్వతి కళా వేదిక ఏర్పాటు చేసే ఆనాటి పాటల ఆణిముత్యాలను ఇలాంటి కార్యక్రమాల ద్వారా వినడం సంతోషంగా ఉందని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ సంగీత విభావరిలో గాయనీ గాయకులు పలు సినీ గీతాలు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. చివరగా అతిథుల చేతుల మీదుగా గాయనీ గాయకులకు షీల్డులు, సర్టిఫికెట్లతో సన్మానం చేశారు. కార్యక్రమంలో అబ్రహం, సత్యం, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అడ్డగోలుగా మట్టి రవాణా.. అక్రమంగా తరలిస్తున్న చర్యలు శూన్యం..

- **ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల వేడుకోలు**
- **రాత్రివేళల్లో భారీ టిప్పర్లతో తరలింపు..**
- **దుమ్ము ధూళితో గ్రామస్తుల ఇక్కట్లు..**
- **సంబంధిత శాఖల మౌనం పై ప్రజల అనుమానాలు.....?**
- **అక్రమ రవాణాపై చర్యలకు డిమాండ్...**

రామడుగు, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)





కరీంనగర్ జిల్లారామడుగు మండలంలో రాత్రివేళల్లో జరుగుతున్న మట్టి రవాణాపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. చీకటి పడగానే జేసీబీలతో మట్టిని తవ్వి భారీ టిప్పర్లలో తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రామడుగు, షానగర్, లక్ష్మీపూర్ పరిసరాలతో పాటు వరద కాలువ ప్రాంతాల నుంచి మట్టి తరలింపు జరుగుతోందనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. కరీంనగర్ వైపు మట్టి రవాణా చేస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

పగటిపూట నిశ్శబ్దం.. రాత్రికి వాహనాల సందడి!

పగటిపూట పెద్దగా కనిపించని టిప్పర్లు రాత్రివేళల్లో వరుసగా రహదారులపైకి వస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెలిచాల క్రాస్‌రోడ్డు, దేశరాజుపల్లి, షానగర్, వెంకటగిరి, వెదిర ప్రాంతాల సమీపంలో మట్టి డంపింగ్ జరుగుతోందనే ఫిర్యాదులున్నాయి. అయితే ఈ తవ్వకాలు, రవాణాకు అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు తేల్చాల్సి ఉంది.

ప్రజలకు దుమ్ము.. వ్యాపారులకు లాభాలా?

భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము ధూళి వ్యాపిస్తోందని, రాత్రివేళల్లో శబ్దాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. గతంలో ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు.


క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి

మట్టి తవ్వకాలు, రవాణాపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమతులు, చలానాలు పరిశీలించి అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను తొలగించి, ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.రాత్రివేళల్లో మట్టి తరలింపుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. సంబంధిత శాఖల తనిఖీలు ఎప్పుడు మొదలవుతాయో వేచి చూడాల్సిందే....!

రోడ్డు పక్కనే ట్రాన్స్ఫారం

- భయాందోళనలో గ్రామస్తులు

రామడుగు, అక్టోబర్ 25(వు దయం ప్రతినిధి)



రామడుగు మండలం షా నగర్ గ్రామంలోని గ్రామపంచాయతీకి సమీపంలో ప్రధాన రహదారిని అనుకొని విద్యుత్ అధికారులు ట్రాన్స్ఫారాన్ని ఏర్పాటు చేశారు. కానీ దానికి కంచెను నిర్మించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని గత కొన్ని నెలలుగా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ట్రాన్స్ఫారం పక్కకు నడవడానికి కూడా భయాందోళనకు గురవుతున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందించి దానికి కంచెను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదలకు వైద్య భరోసా!



- ధరూర్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- మరిన్ని గ్రామాలకు వైద్య సేవలు విస్తరించాలి

ధరూర్ అక్టోబర్ 25 (వుదయం బ్యూరో)

ఆర్థిక ఇబ్బందులతో పేదలు వైద్యానికి దూరం కాకూడదని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ధరూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో అనంత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నిరుపేదలకు ఉచిత చికిత్స ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నరసింహులు ఎమ్మెల్యేను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మోకాళ్ల నొప్పులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సూచన మేరకు గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్య సేవలు అందించే దుకు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోకాళ్ల నొప్పులు, షుగర్, బీపీ తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ ఆసుపత్రిలోనూ నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనంత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైద్య ఖర్చుల భారంతో పేదలు ఇబ్బందులు పడకూడదని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు వారికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ధరూర్‌కే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని మరిన్ని గ్రామాల్లోనూ శిబిరాలు నిర్వహించి పేదలకు వైద్య సేవలు అందించాలని డాక్టర్ నరసింహులుకు సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్ గౌడ్, జిల్లా సీనియర్ నాయకులు జి. వేణుగోపాల్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ డి.ఆర్. విజయ్, నాయకులు డి.వై. రామన్న, సంజీవ్, వైద్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీతో జానపద కళాకారులకు కొత్త భరోసా

కళాకారుల సంక్షేమం, గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు, ప్రమాద బీమాపై కీలక చర్చ

బిజినపల్లి, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):



తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కవులు, కళాకారులు, రచయితల సమావేశం ఆదివారం బిజినపల్లి మండల కేంద్రంలోని ఆర్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సభలో జానపద కళాకారుల సంక్షేమం, కళలకు గుర్తింపు, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య కార్డులు, ప్రమాద బీమా వంటి అంశాలపై ప్రముఖంగా చర్చించారు. సభను ఉద్దేశించి పలువురు ప్రముఖులు మాట్లాడుతూ జానపద కళాకారుల అభ్యున్నతికి తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాకారుల ప్రతిభకు తగిన గుర్తింపు లభించడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు సంఘం కృషి చేయాలని అన్నారు. కళాకారులందరూ ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు.

సభ్యత్వంతో సంక్షేమ సదుపాయాలు

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీలో శాశ్వత సభ్యత్వానికి రూ.5,000, సాధారణ సభ్యత్వానికి రూ.3,000గా నిర్ణయించినట్లు సమావేశంలో వివరించారు. సభ్యత్వం పొందిన కళాకారులకు గుర్తింపు కార్డులు, ఆరోగ్య కార్డులు, ప్రమాద బీమా వంటి సదుపాయాలు అందేలా కృషి చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ 3న సిరిసిల్లలో నిర్వహించనున్న తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ సభలో కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోడాద శీను, గజ్వేల్ వేణు, ఎద్దుల జంగిరెడ్డి, సంతోష్, జయ ప్రకాష్, పిట్టలదొర భాస్కర్, దప్పు స్వామి, రవిశంకర్, ఎల్లారెడ్డి, పాము నాగులు, కంచరపల్లి రాజు, బండారి కురుమయ్య, కొడిదల శ్రవణ్ కుమార్, డి. కృష్ణయ్య, దప్పు లక్ష్మణ్, దప్పు నరసింహ, ఎగిరే బాలు, డాన్సర్ ప్రభాకర్, దప్పు రవి, కాశీదాస్, బోనాస్ రాజు, దప్పు మహేష్ తదితర ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కవులు, కళాకారులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

హట్కరిపేటలో భవాని మాతా పూజా కార్యక్రమాలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ

సదాశివపేట అక్టోబర్ 25 (వుదయం):



సదాశివపేట పట్టణంలోని హట్కరిపేటలో ఉన్న భవసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో భవాని మాతా నవరాత్రుల ముగింపు సందర్భంగా మహా పూర్ణిమను పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

తుల్జాపూర్‌లో నిర్వహించే పూజా సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి మేలుకొలుపు, ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు, సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించి, భజనలు, మేళతాళాల నడుమ పట్టణంలోని పురవీధుల గుండా అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోవూరి శంకర్ గౌడ్, విజయ్, భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు వాదోని చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు రమేష్, అర్జున్, గవర్ధన్ రావు, త్రియాంబక్, తులసీదాస్, హరి, ఎం. విజయ్‌తో పాటు సమాజ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేట,అక్టోబర్ 25:(వుదయం ప్రతినిధి)

నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.బల్మూరు ఎస్ ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బల్మూరు మండల కేంద్రానికి చెందిన సైదులు అనే వ్యక్తికి ఇటీవల తన భార్యతో కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. నిత్యం ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. దసరా పండుగ కు భార్య ను పుట్టింటికి వెళ్లకుండా నిత్యం వేధింపులకు గురిచేసేవాడని అత్తారింటి వారు వేధిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఫోన్ చేసి హెచ్చరిక లు జారీ చేయడంతో ఆందోళన కు గురై ఆత్మ హత్య కు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ క్రమం ఇదే విషయం పై శనివారం రాత్రి భార్యతో మరోసారి గొడవపడిన సైదులు, ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. తెల్లవారే వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా, గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు వెంటనే బల్మూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, పోస్ట్ మార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బల్మూరు ఎస్ ఐ రాజేందర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న చిన్న కుటుంబ కలహాలకే ఆత్మహత్య వంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, ఏవైనా సమస్యలు ఉంటే కౌన్సెలింగ్ తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పోస్ట్ మార్టం అనంతరం శవాన్ని అప్పగించారు.

నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

- నేడు జిల్లా కలెక్టర్ ఎదురుగా ధర్నా
- టి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు గవినోళ్ళ శ్రీనివాస్

నారాయణపేట అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి)



నారాయణపేట జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈనెల 26 సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు.జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, సాగునీటి కొరత, పంటల సాగు మరియు దిగుబడులకు సంబంధించిన ఇబ్బందులతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పెట్టుబడుల భారంతో సతమతమవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.నారాయణపేట జిల్లాలోని వ్యవసాయ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాలని, సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు.

రైతుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని గవినోళ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు.రైతుల ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న ఈ ధర్నాలో ప్రజలు, తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఈ పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. నారాయణపేట జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, అర్హులైన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందచేయాలని, పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించి ,సాగునీటి కొరత, వర్షాభావ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గొరిట గ్రామంలో అమర జవాన్లకు ఘన నివాళులు



తిమ్మాజిపేట, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):

మండల పరిధిలోని గొరిట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం భారతీయ యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమర జవాన్ల స్మారక కార్యక్రమాన్ని నిర్వహించారు. జై జవాన్.. జై కిసాన్.. భారత్ మాతా కీ జై నినాదాల మధ్య దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైన్యంలో పనిచేసిన మందపల్లి హన్మంత్, మందనపల్లి సత్యనారాయణ, ముసలి లక్ష్మారెడ్డి, కాకినూరు శాంతయ్య, ముసలి నోబుల్ రెడ్డి, సందపురం రాంగోపాల్, ఎరువుల శంకరయ్య, పి. చిన్నయ్య, రాజశేఖర్ రెడ్డి, ఏ. ఆంజనేయులు, ఏ. శ్రీధర్ తదితరులు సైనిక జీవితంలోని అనుభవాలను, విధి నిర్వహణలో ఎదురైన పరిస్థితులను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భర్త ఎ. వెంకటయ్య, ఉప సర్పంచ్ రాములు, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, కె. బుచ్చిరెడ్డి, ఎస్. నారాయణ, ఎన్. చిన్నారెడ్డి, కె. రాఘవాచారి, జి. అనంతరాములు, డి. ఆంజనేయులు, జి. శ్రీనివాసులు, ఎస్. లక్ష్మయ్య, స్వామి, శేఖర్ రెడ్డితో పాటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

వెల్దండ అక్టోబర్ 25(వు దయం)



మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన వేదింటి మల్లోజు మంజుల ఇంటి నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆదివారం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. మరియు బొల్లంపల్లి గ్రామానికి చెందిన పారిశుద్ధ కార్మికుడు రమేష్ విద్యుత్ షా గురై చికిత్స పొందుతున్నందున పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, నాయకులు బుచ్చిబాబు, గూళ్ల వెంకటేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా అష్టోత్తరశత మహాయజ్ఞం

వుదయం న్యూస్ శివ్వంపేట, అక్టోబర్ 25

దశమహావిద్యల్లో ఒకటైన మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువుదీరిన శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం లోకకల్యాణం, సకల జనుల శాంతికై అమ్మవారి ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అష్టోత్తరశత (108) కుండాత్మక మహాయజ్ఞం వైభవంగా కనులపండువగా జరిగింది. ఉదయం 8 గంటల నుంచే మంత్రోచ్చారణలు, వేదఘోషలతో శక్తిపీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శక్తిపీఠం ప్రాంగణంలో 200 జంటలు యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బగలాముఖీ అమ్మవారికి విశేషంగా పసుపుతో హరిద్రార్చన నిర్వహించడంతోపాటు రుద్రయామల, శ్రీసూక్తం, దేవీసూక్తం, బగలాముఖీ అష్టోత్తర నామార్చనలతో ప్రత్యేక పూజలు, అభిషేకం, మంత్రపుష్పం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రాల నడుమ సాగిన యజ్ఞ కార్యక్రమంతో శక్తిపీఠం ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మహాయజ్ఞం కార్యక్రమ ఏర్పాట్లను మాజీ జడ్పీటీసీ, శక్తిపీఠం ట్రస్టు సభ్యులు పబ్బమహేశ్ గుప్తా పర్యవేక్షించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మహాయజ్ఞం సందర్భంగా మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాదాపు 3000 వేల మంది భక్తులకు పబ్బరమేశుప్తా, పబ్బమహేశ్గుప్తా, సుదర్శన్ గౌడ్, వెంకట్రెడ్డిలు సొంత ఖర్చులతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పబ్బ రమేశుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశగుప్త, మాజీ ఎంపీపీ హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది శివకుమార్ గౌడ్, నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, సీఐ వెంకటరాజాగౌడ్ దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ మల్లేష్, 100 మంది వేద పండితులు, రుత్వికులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

వెల్దండ అక్టోబర్ 25 (వు దయం)

మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో నిర్మిస్తున్న శివాలయం మరియు ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి గోకారం గ్రామానికి చెందిన హైదరాబాద్ సైదాబాద్ తాసిల్దార్ గా పనిచేస్తున్న మణిపాల్ రెడ్డి 1,00,116/- (ఒక లక్షా నూట పదహారు రూపాయలు) విరాళంగా ఆదివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. వారి దాతృత్వానికి ఆలయ నిర్మాణ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, ప్రతాప రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి,వీరారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..

- ఆచూకీ తెలిసినవారు సమాచారం ఇవ్వండి
- మద్దూర్ ఎస్ ఐ విజయ్ కుమార్


దామరగిద్ద అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి)



నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల రోడ్డు మార్గంలో దినేష్ రైస్ మిల్ సమీపంలో ఆదివారం సుమారు 6 గంటల సమయంలో విద్యుత్ స్తంభానికి ఉరివేసుకున్న స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది అని ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, మృతుడి వద్ద ఎలాంటి మొబైల్ ఫోన్, ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలు లభించలేదని మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా అతని కుటుంబ సభ్యులు, బంధువుల వివరాలు తెలిసినట్లయితే వెంటనే మద్దూర్ ఎస్సై ఫోన్ నంబర్ 87126 70407 లేదా 8712671026 మద్దూర్ పోలీస్ స్టేషన్ కి ప్రజలు ఈ సమాచారాన్ని ఇవ్వాలని ఎస్ఐ విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

మాగనూరు నూతన ఎస్ఐ మహేందర్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుల ఘనంగా సన్మానం

మాగనూర్ అక్టోబర్ , 25 (వుదయం న్యూస్)



మాగనూరు మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కే. మహేందర్ రెడ్డికి మాగనూరు మండల కాంగ్రెస్ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మాగనూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మహేందర్ రెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాగనూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ శంకర్ లింగం, మాగనూరు సత్యప్ప, కొత్తపల్లి శంకర్, నేరేడు నాగరాజ్, ఆంజనేయులు తదితర మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్న తోర్నాల సర్పంచ్ దంపతులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లింపు

వుదయం మనూర్ అక్టోబర్ 25



సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ నియోజకవర్గం, మనూర్ మండలం తోర్నాల గ్రామ సర్పంచ్ దంపతులు ఆదివారం నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న సర్పంచ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి



వుదయం ప్రతినిధి నిజాంపేట

మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు సంపత్ కుమారుడి వివాహ వేడుక ఆదివారం చల్మెడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ప్రేమానురాగాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదే చంద్రం, మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్ గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ అజీజ్, మాజీ ఎంపీటీసీలు బాల్రెడ్డి,సంజీవరెడ్డి, భాస్కరరావు,మాజీ సర్పంచులు బజార్ తిరుమల గౌడ్, ప్రభావతి, సంగు స్వామి, బిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్ గౌడ్, నాయకులు దుబ్బ రాజాగౌడ్, అంజా గౌడ్, మోహన్ రెడ్డి, చంద్రయ్య, పంపరి శివకుమార్, మాసుల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం వేంకటేశ్వర స్వామివారికి వెండి లక్ష్మీహారం సమర్పణ

బిజినపల్లి, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):



బిజినపల్లి మండల పరిధిలోని పాలెం శ్రీ వేంకటేశ్వర స్వామివారికి భక్తులు వెండి లక్ష్మీహారాన్ని సమర్పించారు. ఆదివారం ఉదయం పాలెం గ్రామానికి చెందిన కీర్తిశేషులు కృష్ణయ్య గౌడ్ చిన్న కుమారుడైన రాముగౌడ్, లలిత దంపతులు 301 గ్రాముల మిశ్రమ వెండితో తయారు చేయించిన మామిడి పిందెల లక్ష్మీహారాన్ని దేవస్థానానికి భక్తితో సమర్పించారు. స్వామివారిపై తమకున్న భక్తిని చాటుకున్నారు. భక్తులు తమకు తోచిన విధంగా స్వామివారికి కానుకలు సమర్పిస్తూ, దేవస్థాన అభివృద్ధికి తోడ్పడాలని, ఈ దంపతుల భక్తి ఇతర భక్తులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి జనుంపల్లి జయపాల్ రెడ్డి, అర్చకులు రామానుజాచార్యులు, జయంత్, శుక్ల, దేవస్థాన సిబ్బంది శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై పాఠశాలలో నేటి నుండి అవగాహన కార్యక్రమాలు

నారాయణపేట అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి)

సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ పోక్సో చట్టం 2012 పై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఈనెల 26 నుండి 31 వరకు డి ఎల్ ఎస్ ఏ సంస్థ ఒక ప్రకటనలో తెలిపారు. నల్సా (జాతీయ న్యాయ సేవాధికార సంస్థ), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా చైర్మన్ ప్రధాన జిల్లా న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వింధ్యా నాయక్ అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ పేరుతో బాలల లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం (పోక్సో) 2012 పై పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం చేపట్టనున్నారు.ఈ కార్యక్రమం మొదటి విడత అక్టోబర్ 26 నుండి 31 వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

అవగాహన అంశాలు నిర్వహించే పాఠశాలలు

మేరా బచ్‌పన్ మేరా అధికార్ నా బాల్యం నా హక్కు గవర్నమెంట్ హై స్కూల్ గ్రౌండ్, ఐ యాం కానూన్ జానో బచ్‌పన్ బచావో చట్టం తెలుసుకో బాల్యాన్ని కాపాడు ,కస్తూర్బా గాంధీ విద్యాలయం, యాదగిరి రోడ్డు,సురక్షిత్ క్లిక్ సురక్షిత్ బచ్‌పన్,సురక్షిత క్లిక్ సురక్షిత బాల్యం ,గవర్నమెంట్ హై స్కూల్, మార్కెట్ లైన్,బోలో బతావో బచావో,చెప్పు, తెలియజేయి, రక్షించు,నా బాల్ వివాహ్ నా బాల్ శోషణ్, బాల్య వివాహం వద్దు, బాలల దోపిడీ వద్దు ,గవర్నమెంట్ హై స్కూల్, జాజాపూర్,జాగ్రుక్ బచ్‌పన్ సశక్త్ భారత్ – అవగాహన కలిగిన బాల్యం, శక్తివంతమైన భారత్ – గవర్నమెంట్ హై స్కూల్ ముష్రిఫా, కోస్గి, బ్రిలియంట్ స్కూల్, మోడ్రన్ హై స్కూల్, శ్రీ సాయి స్కూల్ ఈ ఆరు అంశాలపై పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలు, సైబర్ భద్రత, ఫిర్యాదు విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు వారు తెలిపారు.ఈ అవగాహన సదస్సులలో నారాయణపేట, కోస్గి, మక్తల్ కోర్టుల సీనియర్,జూనియర్ న్యాయమూర్తులు, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు నిపుణులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు దశలవారీగా హాజరై కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

మటన్ షాపు వద్ద వృధాగా పోతున్న త్రాగునీరు

- చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

వుదయం ప్రతినిధి నిజాంపేట మండలం



ఎల్‌నినో ప్రభావంతో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, నీటిని వృథా చేయవద్దని అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదు. నిజాంపేట మండల కేంద్రంలోని ఓ మటన్ షాపు వద్ద నీటిని వృథా చేస్తుండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ప్రజలకు సూచిస్తున్నప్పటికీ కొందరు వాటిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరుతున్నారు.

బ్రాహ్మణ శంఖారానికి తరలిన బ్రాహ్మణులు

నారాయణపేట టౌన్ అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి)



ఉమ్మడి పాలమూరు జిల్లా జడ్చర్లలో ఆదివారం జరిగిన బ్రాహ్మణ శంఖారావం కు నారాయణపేట జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి బ్రాహ్మణులు,మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి పలు బస్సుల్లో తరలి వెళ్లారు.

వెట్టిచాకిరీ నిర్మూలనకు 'స్వేచ్ఛారథం'

బాధితులకు అండగా టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 25:వుదయం

వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 'స్వేచ్ఛారథం' ప్రచార వాహనాన్ని జిల్లా అదనపు కలెక్టర్ పాండు జెండా ఊపి ప్రారంభించారు. వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడం, వారికి రక్షణ కల్పించడం, పునరావాసం అందించడం, కార్మికుల హక్కులపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్

వెట్టిచాకిరీకి గురైనవారు లేదా అలాంటి ఘటనల గురించి తెలిసినవారు 080-69434 343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ ద్వారా సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అప్పులు, అడ్వాన్సుల పేరుతో బలవంతంగా పనిచేయించడం, వేతనాలు నిలిపివేయడం, బెదిరింపులకు పాల్పడటం, కార్మికులను పని నుంచి స్వేచ్ఛగా బయటకు వెళ్లనివ్వకపోవడం వంటి పరిస్థితులు వెట్టిచాకిరీ కిందకు వచ్చే అవకాశం ఉందని వివరించారు.

కార్మికుల రక్షణకు చర్యలు

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, వెట్టిచాకిరీని నిషేధిస్తూ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు. బాధితులను గుర్తించి రక్షించడం, ఘటనలపై సమగ్ర విచారణ జరపడం, పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయం అందించడం కోసం జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఉప కార్మిక కమిషనర్ ఎం. యాదయ్య అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. వెట్టిచాకిరీ బాధితులను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా కృషి చేయడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

33 జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు

వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ ప్రచారం ద్వారా అవగాహన కల్పించనున్నారు. కార్మికుల హక్కులు, ఫిర్యాదు చేసే విధానాలు, బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణ, సహాయ, పునరావాస సేవలపై ప్రచార వాహనం ద్వారా సమాచారం అందించనున్నారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని సంబంధిత శాఖల సమన్వయంతో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్తయ్య, సహాయ కార్మిక కమిషనర్ డి. సాహితి, పటాన్‌చెరు సహాయ కార్మిక అధికారి ఎస్. ప్రవీణ్, జహీరాబాద్ సహాయ కార్మిక అధికారి ఆయేషా అఖీల్, పోలీసు శాఖ అధికారులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (AHTU), బాలల సంక్షేమ కమిటీ (CWC), ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (IJM), ఇతర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ గోకులం పాఠశాలలో కరాటే విద్యార్థులకు బెల్టు సర్టిఫికెట్ల ప్రధానం



నారాయణపేట టౌన్ అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి)

నారాయణపేట పట్టణంలోని శ్రీ కృష్ణ గోకులం పాఠశాలలో సీనియర్ కరాటే మాస్టర్ అశోక్ మాస్టర్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ న్యాయవాది (డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్) లక్ష్మీపతి గౌడ్, కృష్ణ గోకులం షటిల్ టీం సభ్యులు పాల్గొని విద్యార్థులకు బెల్టు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైట్ టూ ఆరెంజ్ బెల్ట్ ప్రమోషన్ పొందిన సుప్రియ,సాయి, ఏల్లో బెల్ట్ టూ బ్లూ బెల్ట్ ప్రమోషన్,తనిస్క్ గౌడ్ ,వైట్ బెల్ట్ టూ ఎల్లో బెల్ట్,శివాని,నిఖిత,వరసిద్ధి, రమ్య,దీక్ష,వైట్ బెల్ట్ టూ బ్లూ బెల్ట్ ప్రమోషన్ పొందిన ఆనంద్,ఏల్లో బెల్ట్ టూ బ్లూ బెల్ట్ పొందిన మానస,ఆరెంజ్ బెల్ట్ టూ మానస లకు బెల్ట్స్ , సర్టిఫికేట్ లను అందజేశారు. నేటి బాలలే రేపటి భారత పౌరులు, ప్రతి ఒక్క స్టూడెంట్ గురువును పూజించాలని, కన్న తల్లిదండ్రులను గౌరవించాలని,తోటి మిత్రులతో బాధ్యతగా మెలగాలని,ప్రతి ఒక్కరూ కరాటేలో బ్లాక్ బెల్ట్ వరకు ఓర్పు, క్రమశిక్షణతో నేర్చుకోవాలని,చదువుల్లో రాణించాలని, ప్రతిఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ఆటలపోటీల్లో పాల్గొనాలని, అప్పుడే మీరు ఒక శక్తివంతమైన పౌరులుగా తయారవుతారని కొనియాడారు.

కరాటే అనేది దేహ ధారుడ్యానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమానికి బాలరాజు, ల్యాబ్ శివ కుమార్, లోకేష్, సవిన్, మాస్టర్ మహేష్, మాస్టర్ నితిన్,విద్యార్థులు, యం.అఖిల్, రాజేశ్వరి,అభిరామ్,అర్జున్, రక్షిత, యం.అమూల్య, బృందా నాయుడు,నీహారిక,భాను తేజ,అభిలాష్,రక్షిత, అక్షర,ఆనంద్,సరసింహ,భావేష్ నాయుడు, పేరెంట్స్,యం.అశోక్,వెంకటేష్,రాజు పాల్గొన్నారు.

మునిపల్లి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి!

స్థానిక సర్పంచులు, సీనియర్ నాయకులతో కలిసి పత్రికా సమావేశం

ఈరోజు మునిపల్లి మండలం పిఎస్ఆర్ గార్డెన్లో సర్పంచులు స్థానిక నాయకులతొ కలిసి పత్రికా సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ మాట్లాడుతూ.. మునిపల్లి మండల పరిధిలోని రైతులు ప్రస్తుతం వ్యవసాయ సంక్షోభం ఎలినెనో ప్రభావం ఎదుర్కొంటున్నారు. మండలంలో ప్రధాన పంటలైన పత్తి, చెరుకు, మిర్చి పంటలు ప్రతికూల పరిస్థితుల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు . పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు, ఆశించిన దిగుబడులు రాక ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట నష్టపరిహారం కింద తక్షణమే పరిహారం ఎకరానికి 25000 అందించాలి! ముఖ్యంగా మిర్చి, చెరుకు పంటలకు నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నాం. రబీ సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నప్పటికీ రైతుబంధు పెట్టుబడి సాయం అందకపోవడం రైతులకు ఆర్థిక భారంగా మారుతోంది. మండలంలోని వ్యవసాయ పరిస్థితులను ప్రభుత్వం తక్షణమే సమీక్షించి, పంటల నష్టం, సాగునీటి కొరత, విద్యుత్ సమస్యలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. రైతుల కష్టాలను గుర్తించి, వారి పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా, వ్యవసాయాన్ని కొనసాగించగలిగేలా ప్రభుత్వం అండగా నిలవాలిని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నమ్ కార్యక్రమంలో మునిపల్లి మండల తాజా మాజీ జెడ్పిటిసి పైతర మీనాక్షి సాయికుమార్, ఎక్స్ ఎంపీపీ చంద్రయ్య, మండల నాయకులు మంతూరి శశికుమార్, బండారి పాండు, సర్పంచులు ఇర్ఫాన్ పటేల్ , విట్టల్, మల్లేశం, రమేష్ , సంగ మేశ్వర్ దయానంద్, రాజు, నాయకులు , గడ్డం భాస్కర్ , మాజీ సర్పంచులు పైతర మొగులయ్య, గోపులారం బాగయ్య , గోపులారం బక్కన్న, గార్లపల్లి శంకరయ్య, మేల సంఘం శ్రీనివాస్ , చీలపల్లి మౌలానా , తుడుం దుర్గయ్య , తదితరులు పాల్గొన్నారు



మాంసం దుకాణాల మాటున 'మందు సిట్టింగ్'లు!

- **మల్దకల్‌లో పోలీసుల మెరుపు తనిఖీలు**
- **ఉల్లంఘిస్తే కేసులు తప్పవు!**

మల్దకల్ అక్టోబర్ 25 (వుదయం బ్యూరో)



మాంసం దుకాణాల వద్ద మద్యం సిట్టింగ్ లకు అడ్డుకట్ట వేసేందుకు మల్దకల్ పోలీసులు రంగంలోకి దిగారు. జోగులాంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న చికెన్, మటన్ దుకాణాలు, వాటి అనుబంధ గదుల్లో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల ప్రాంగణాల్లో మద్యం సేవించేందుకు స్థలాలు కేటాయించ రాదని నిర్వాహకులను హెచ్చరించారు. రహదారుల పక్కన మద్యం సేవించడం వల్ల మహిళలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



స్టేడియం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో, ఆర్టీఓ కార్యాలయం వెనుక ఉన్న 10 ఎకరాల స్థలాన్ని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, స్థల అనుకూలతపై చర్చించారు. త్వరలోనే స్టేడియం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడి వద్ద ఇనుప రాడ్ల చోరీకి యత్నం

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ముత్తారం అక్టోబర్ 25(వుదయం ప్రతినిధి):

ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో ముదిరాజ్ పెద్దమ్మ గుడి సమీపంలో ఇనుప రాడ్ల చోరీకి యత్నించిన ఘటన ఆదివారం కలకలం రేపింది.ఇనుప రాడ్లను దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులను గ్రామ యువకులు అప్రమత్తంగా వ్యవహరించి పట్టుకున్నట్లు సమాచారం. గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ దృష్టికి తీసుకెళ్లగా,ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.ఘటనపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

కాంగ్రెస్ దుష్ప్రచారాలను తిప్పి కొడతాం



- **దొంతిలో అతి త్వరలోనే మరింత మంది బీఆర్ఎస్‌లోకి..**
- **బీఆర్ఎస్ గ్రామకమిటి అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా**

వుదయం నుంచి శివ్వంపేట, అక్టోబర్ 25

శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను తాము తిప్పి కొడుతామని బీఆర్ఎస్ గ్రామకమిటి అధ్యక్షులు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ నుంచి 50 మంది బీఆర్ఎస్ పార్టీలోకి వస్తే వారంతా కాంగ్రెస్ వారు కాదని చెప్పడం కాంగ్రెస్ పతనానికి నిదర్శనం అన్నారు.సొంత కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సైతం రక్షణ కరువైందని, కాంగ్రెస్ విధానాలు నచ్చకనే బీఆర్ఎస్ పార్టీలోకి స్వచ్ఛందంగా వచ్చారని, అతిత్వరలోనే మరికొంత మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలోకి రావడం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులకు కౌంటర్ ఇచ్చారు. గంట శ్యామ్, జంగం స్వామిలు మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు భూముల విషయంలో దౌర్జన్యం చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీలోకి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఫ్షన్ సభ్యులు లాయక్, కొదాస్ రాజు, చాకలి దశరథ, వారాల శ్యాం, వెంకటేష్, గంట శ్యాం, చుక్క సుధాకర్, నీరుడి బాబు, గుర్రం శ్రీకాంత్రెడ్డి, జగిని చంద్రం, జంగం స్వామి, పిట్ల నరేష్, చుక్క మల్లేశ్, కొదాస్ సత్యనారాయణ, కొదాస్ స్వామి, కర్రె శేఖరౌడ్,, గోత్రాల లక్ష్మి నర్సయ్య, గౌస్ పాష, దుందిగల్ల భిక్షపతి బేగరి ముత్యాలు తదితరులు ఉన్నారు.

స్థల వివాదం.. తమ్ముడిని కర్రతో కొట్టి చంపిన అన్న

40 గజాల స్థలం కోసం ఘాతుకం?

కంది మండలం మక్తలూరులో ఘటన

కంది వుదయం :



చిన్నపాటి ఇంటి స్థలం ఇద్దరు అన్నదమ్ముల మధ్య చిచ్చు రేపింది. రెండేళ్లుగా కొనసాగుతున్న స్థల వివాదం చివరకు హత్యకు దారితీసింది. తమ్ముడిపై అన్న కర్రతో దాడి చేయడంతో అతడు ప్రాణాలు కోల్పోయిన ఘటన కంది మండలం మక్తలూరు గ్రామంలో గత రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మక్తలూరు గ్రామానికి చెందిన కొత్తగాడి వెంకటేష్ (48), కొత్తగాడి శ్రీనివాస్ (36) అన్నదమ్ములు. వీరిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి మధ్య సుమారు 40 చదరపు గజాల ఖాళీ ఇంటి స్థలం విషయంలో గత రెండేళ్లుగా వివాదం కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గత రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇద్దరి మధ్య మరోసారి వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. దీంతో ఆగ్రహానికి గురైన వెంకటేష్ తన తమ్ముడు శ్రీనివాస్‌పై కర్రతో దాడి చేసి, శరీరంలోని పలు భాగాలపై విచక్షణారహితంగా కొట్టినట్లు ప్రాథమిక సమాచారం. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలిసింది. పోలీసుల విచారణతో పూర్తి వివరాలు వెలుగులోకి.. స్థల వివాదమే హత్యకు కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో విచారణ జరగాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసుల చర్యలు తెలియాల్సి ఉంది.

వట్టవర్లపల్లి గ్రామ పునరావాసంపై అందరు సహకరించండి

పునరావాస కమిటీ

అచ్చంపేట, అక్టోబర్ 25 (వుదయం ప్రతినిధి)



అమ్రాబాద్ టైగర్ ఫారెస్ట్ కోర్ ఏరియా ఏటీఆర్) నుండి స్వచ్ఛంద పునరావాసానికి ముందుకొచ్చిన సుమారు 450 మంది గ్రామస్థులు ఇంకా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్న మరికొందరు ఉన్నారని అందరు సహకరించాలని పునరావాస కమిటీ అధ్యక్షులు సాయిబాబు కోరారు. ఆదివారం వటువర్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పునరావాస కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి ఆయన మాట్లాడుతూఅమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని వట్టవర్లపల్లి గ్రామంలో స్వచ్ఛంద గ్రామపునరావాస ప్రక్రియలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన ఎంఓయూ (MOU) ఒప్పంద పత్రాలపై సంతకాల కార్యక్రమంలో సుమారు 450 మంద గ్రామస్థులుస్వచ్ఛందంగా సంతకాలు చేశారు. ఇంకా కొంతమంది కూడా స్వచ్ఛందంగా ఎంఓయూ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో పునరావాస ప్రక్రియపై కొందరు చేస్తున్న ఆరోపణలకు, ముఖ్యంగా పునరావాస కమిటీ సభ్యులు గ్రామం వెలుపల నివసిస్తున్న కొంతమంది వ్యక్తులు నకిలీ వ్యక్తులని చేస్తున్న ఆరోపణలకు సంబంధించి, పేదల ఆర్థిక ఎదుగుదలను ఓర్వలేక అసత్య ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసం అని అయన ప్రశ్నించారు. వారి రాజకీయ ఎదుగుదల కోసం ఓట్లుఅడిగినవారు తమకు సంక్షేమ న్ని ఎందుకు అడ్డుకంటు న్నారో సమాధానం చెప్పాలి అని పునరావాస కమిటీ సభ్యులు, గ్రామస్థులు సమావేశమై తమ వివరణను తెలియజేశారు. ఈ సందర్భంగా సంయుక్త పునరావాస కమిటీ అధ్యక్షుడు సాయిబాబు మాట్లాడుతూ, గ్రామ పునరావాస ప్రక్రియ అనేది ప్రజల మెరుగైన భవిష్యత్తు కోసం చేపడుతున్నస్వచ్ఛంద ప్రక్రియ అని తెలిపారు. తమ కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పునరావాసానికి ముందుకొస్తున్న ప్రతి కుటుంబం నిర్ణయాన్ని గౌరవించాలని కోరారు. పునరావాసానికి అంగీకరించిన వారిని నకిలీ వ్యక్తులుగా చిత్రీకరించడం సరికాదని, ప్రతి వ్యక్తి అర్హత, హక్కులు, దరఖాస్తులు, సంబంధిత అధికారిక రికార్డులఆధారంగావిషయాలను పరిశీలించాలని కమిటీసభ్యులుపేర్కొన్నారు.గ్రామంలోనివసిస్తున్నవారైనా, వివిధ కారణాలతో గ్రామం వెలుపల ఉంటున్నవారైనా, వారి వివరాలను అధికారిక రికార్డుల ఆధారంగా పరిశీలించకుండా ఆరోపణలు చేయడం సమంజసం కాదని తెలిపారు. గ్రామ పునరావాసంపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి ఆధారాలతో తీసుకెళ్లాలని, ప్రజల్లో అనవసర గందరగోళం సృష్టించవద్దని కమిటీ సభ్యులు, గ్రామస్థులు కోరారు. పునరావాసం కావాలా వద్దా అనేది ప్రతి కుటుంబం తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛందంగా తీసుకునే నిర్ణయమని, ఆ నిర్ణయాన్ని పరస్పరం గౌరవించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బి. బాలరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జహంగీర్, కమిటీ సభ్యులు జానకిరాములు, గంధర్ సూర్యం, కరీం, శంషుందర్, శివప్రసాద్, ఎం.డి. నిరంజన్, ప్రవీణ్ గ్రామస్థులు శ్రీను, పాత్య నాయక్, జూలు నాయక్, కర్నాటి శ్రీను, అరువంటి పరమేష్, లచ్చిరాం, మోతియా, సాదిక్, బలమియా, నిరంజన్, పురుషోత్తం తదితరులు పాల్గొని పునరావాస ప్రక్రియపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామ ప్రజల స్వచ్ఛంద నిర్ణయాలను గౌరవిస్తూ, అధికారిక ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేందుకు అందరూ సహకరించాలని పునరావాస కమిటీ విజ్ఞప్తి చేశారు

వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

సూక్ష్మంలో మోక్ష మార్గం

శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతకల్పం

నాగర్ కర్నూల్, అక్టోబర్ 25 (వుదయం బ్యూరో):



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం నాడు రామాలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ శాస్త్రోక్తంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య భక్తులు భక్తిశ్రద్ధలతో సామూహికంగా వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ.. మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ సూక్ష్మంలో మోక్ష మార్గం పొందుటకు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించాలని అన్నారు. భగవంతుని అనుగ్రహంతో సకల కష్టాలు తొలగిపోతాయని తెలిపారు. అనంతరం వ్రతంలో పాల్గొన్న భక్తులకు వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. రామాలయ అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక అన్నప్రసాద పంపిణీలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కందడై శ్రీనివాసాచార్యులు, అర్థం రవీందర్, మల్లేష్, గొల్ల రాములు, రమాదేవి, శారద, శివ, రామాలయ భజన భక్త బృందం, రామాలయ యువత, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

వాటర్ ట్యాంకర్‌తో మొక్కలకు నీరు పోస్తుండగా కార్మికుడిని ఢీకొట్టిన ఆటో ట్రాలీ

వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 25)



రింగ్‌రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. జీహెచ్ఎంసీ సిబ్బంది వాటర్ ట్యాంకర్ (TS 12 UD 6099) ద్వారా డివైడర్‌లోని చెట్లకు నీరు పోస్తుండగా, హైదరాబాద్ నుంచి ముత్తంగి వైపు వెళ్తున్న ఆటో ట్రాలీ (TS 07 W 9174) వేగంగా వచ్చి నీరు పోస్తున్న కార్మికుడు శ్రీనివాస్ అలియాస్ వీరు (30)ను ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో కార్మికుడు శ్రీనివాస్‌తో పాటు ఆటో నడుపుతున్న శ్రీనాథ్ (25-30) తీవ్ర గాయాలపాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

